ANN తెలుగు

Follow: @ANNTELUGU

09-01-2026

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 15  పేజీలు-08  వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM

## విజయ్ సినిమాపై కుట్ర

**జననాయగన్ రిలీజ్ కు బ్రేక్**

**సినీ చరిత్రలో అత్యధిక రీఫండ్ రికార్డు**




**మహా :** సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన విజయ్ చివరి చిత్రం 'జన నాయగన్' వాయిదా పడింది. విజయ్ సినిమాలపై వరుసగా కుట్రలు జరుగుతుండగా, కుట్రల నేపథ్యంలోనే ఆయన పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ఆఖరి సినిమా అని ప్రకటించినా వేధింపులు, కుట్రలు ఆగలేదు. ఎన్ని కుట్రలు చేసినా తళపతి విజయాన్ని, అభిమానాన్ని అడ్డుకోలేరని ఫ్యాన్స్ అంటున్నారు. సెన్సార్ సమస్యల కారణంగా ప్రస్తుతానికి సినిమా విడుదల వాయిదా వేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ తెలిపింది. జన నాయగన్' వాయిదా పడటంతో సినీ ఇండస్ట్రీ నుంచి విజయ్‌కు మద్దతు పెరుగుతోంది. ఇప్పటికే పలువురు దర్శకులు, నటులు ఆయన సినిమాకు మద్దతు తెలిపారు. పెద్ద సినిమాల పరిస్థితి ఇలా ఉంటే చిన్న సినిమాల పరిస్థితి ఇంకెలా ఉంటుందోనంటూ దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్ విచారం వ్యక్తం చేశారు. ఒక సినిమా విడుదలకు ముందు ఇలా జరగడం సరైనదని కాదని అభిప్రాయపడ్డారు.జనవరి 9న మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్ర బృందం ప్రకటించడమే కాదు, ఓవర్సీస్ సహా, పలు ప్రాంతాల్లో టికెట్ బుకింగ్‌స్‌కు అనుమతి కూడా ఇచ్చింది. ఇప్పుడు సినిమా వాయిదా పడటంతో టికెట్ డబ్బులను వెనక్కి తిరిగి ఇచ్చే ప్రక్రియ మొదలైంది. సినిమా విడుదలకు మార్గం సుగమం అవుతుందని అభిమానులు భావించారు. బుధవారం వరకూ బుక్ మై షో వేదిక 4.50 లక్షల టికెట్స్ అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో అమ్ముడయ్యాయి. ఇప్పుడు ఆ టికెట్‌స్‌కు సంబంధించిన మొత్తాన్ని బుక్ మై షో వెనక్కి ఇచ్చే ప్రక్రియ మొదలు పెట్టింది. బుక్ మై షో చరిత్రలోనే ఇదే అత్యధిక రిఫండ్ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇండియన్ సినీ చరిత్రలో ఈ స్థాయిలో టికెట్స్ క్యాన్సిల్ అయి, తిరిగి చెల్లించడం ఎప్పుడూ లేదని అంటున్నారు. 'జన నాయగన్'కు సెన్సార్ సమస్య చుట్టుముట్టింది. సీబీఎఫ్‌సీ సూచనల మేరకు మార్పులు చేసినా, బోర్డు సభ్యుల్లో ఒకరి నుంచి అభ్యంతరాలు వ్యక్తమవడంతో ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా ఆపేశారు. ఇది కాస్తా మద్రాసు హైకోర్టుకు చేరింది. జనవరి 9వ తేదీ ఉదయానికి తీర్పు వెల్లడిస్తామని కోర్టు చెప్పింది. దీంతో సినిమాను పూర్తిగా వాయిదా వేశారు.

**టాప్ న్యూస్**

### నేను కారణ జన్మురాలిని



- నా పేరు చెప్పుకుని బతుకుతున్నారు
- అనసూయ సంచలన కామెంట్స్

02

### దాడులు జరుగుతుండగా



- మమతా బెనర్జీ డేర్
- ఐప్యాక్ చీఫ్ ఇంటికి సీఎం

02

### ఫిబ్రవరి 1న నిర్మలమ్మ బడ్జెట్



- 9వ సారి దేశ ఆర్థిక బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించబోతున్న తెలుగింటి కోడలు
- రూ. 12 లక్షల కోట్ల వరకు ఉండనున్న బడ్జెట్
- ఈ సమావేశాల్లోనే పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపే అవకాశం

02

## ఒక్కరోజులోనే రూ.8 లక్షల కోట్లు ఆవిరి

### స్టాక్ మార్కెట్ ఢమాల్

**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్- అమెరికా మధ్య వాణిజ్యంపై సందిగ్ధత నెలకొన్న వేళ.. సూచీలు భారీ ఒత్తిడి ఎదుర్కొన్నాయి. రష్యాను కట్టడి చేసేందుకు భారత్ వంటి దేశాలపై 500 శాతం సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాలు, భౌగోళిక ఉద్రిక్తతల వంటివీ ఆజ్యం పోశాయి. దీంతో ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 26వేల దిగువన ముగిసింది. దీంతో మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.480 లక్షల కోట్ల నుంచి రూ.472 లక్షల కోట్లకు దిగొచ్చింది.

# భారత్‌పై ట్రంప్ కక్ష

## రష్యా చమురుపై కొత్త ఆంక్షల బిల్లు.. భారత్‌పై 500 శాతం టారిఫ్‌లు



**మహా:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రష్యాపై ఒత్తిడి పెంచేందుకు ద్వైపాక్షిక ఆంక్షల బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాపై ఏకంగా 500 శాతం సుంకాలు పెంచేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ విషయంపై రిపబ్లికన్ సెనెటర్ లిన్సే గ్రాహం ఎక్స్‌లో చేసిన పోస్టు ఆందోళన కలిగిస్తోంది. ట్రంప్‌తో సమావేశమై పలు అంశాలపై తాను చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు ట్రంప్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. దీనికి సంబంధించిన బిల్లుపై వచ్చే వారం ఓటింగ్ జరగనున్నట్లు చెప్పారు. రష్యా చమురు కొనుగోలు చేసి నిధులు సమకూర్చుకుంటున్న భారత్, చైనా, బ్రెజిల్ దేశాలను ఇకనుంచి కొనుగోలు చేయకుండా ఈ ఈ బిల్లు అడ్డుకుంటుందని వెల్లడించారు. రష్యాపై ఉన్న ఆంక్షలు ఉల్లంఘించే ఆయా దేశాలపై 500 శాతం టారిఫ్ విధించే ఛాన్స్ ఉంటుందని పేర్కొన్నారు. పుతిన్ యుద్ధం ఆపడానికి రెడీ అంటూనే అమాయకులను చంపుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో చైనా మొదటిస్థానంలో ఉంది. భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ చమురు కొనుగోళ్లపై ట్రంప్ ఎప్పటినుంచో కోపంతో ఉన్నారు. ఈ కారణంతోనే గతేడాది భారత్‌పై సుంకాలను 50 శాతానికి పెంచారు. ఇదిలాఉండగా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి భారత్‌అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ 500 శాతం టారిఫ్‌లు పెంచే బిల్లుకు ఆమోదం తెలపడం ప్రాధాన్యం సంతరించుకుంది.





# ఉపాధి హామీని రద్దుచేసే కుట్ర

## ప్రధాని మోదీపై సీఎం రేవంత్ ధ్వజం

### గ్రామగ్రామాన తీర్మానాలు.. జిల్లాల్లో బహిరంగ సభలు

### పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులకు బాధ్యతలు

### ములుగు సభకు సోనియా లేదా రాహుల్ ను ఆహ్వానించాలని నిర్ణయం

**హైదరాబాద్, మహా**

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు వెనక ప్రధాని నరేంద్ర మోదీ కుట్ర ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. పేదలపై కక్షతో ఈ పథకాన్నే మారుస్తారా? అని ప్రశ్నించారు. నిబంధనల ముసుగులో ఈ పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారని తెలిపారు. మెజారిటీ ఉందని, చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదని అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ, పీఏసీ విస్తృతస్థాయి సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే ఒప్పుకోమని రేవంత్ రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయం ఇదేనన్నారు. ఉపాధి హామీ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ఉపాధి హామీ పథకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఒకప్పుడు దొరల దగ్గర పేదలు వెట్టిచాకిరి చేస్తూ బతికేవారని, దేశప్రజలకు విముక్తి, స్వతంత్రాన్ని ఇచ్చి ఓటుహక్కు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మొదట అమలు చేసింది తెలుగు రాష్ట్రాలేనని సీఎం తెలిపారు. ఉపాధి హామీ చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గిపోయాయని అన్నారు.

మిగతా 2లో

# బాగున్నారా.. అమ్మా..!

## రాష్ట్ర మహిళా మంత్రులకు..

## కేసీఆర్ ఆత్మీయ పలకరింపు

### కేసీఆర్ ఫాంహౌజ్ కు మంత్రులు సీతక్క, కొండా సురేఖ

### మేడారం జాతరకు రావాలని ఆహ్వానం

### మేడారం అభివృద్ధి పనులపై కేసీఆర్ కు వివరించిన మంత్రులు



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర సందర్భంగా రాష్ట్ర రాజకీయాల్లో ఒక ఆసక్తికరమైన మరియు ఆహ్లాదకరమైన దృశ్యం చోటుచేసుకుంది. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి, సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర మంత్రులు సీతక్క , కొండా సురేఖలు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో కలిసి జాతరకు ఆహ్వానించారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

**కేసీఆర్ దంపతులకు సాదర ఆహ్వానం**

ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా గుర్తింపు పొందిన మేడారం జాతరకు రావాల్సిందిగా మంత్రులు సీతక్క, కొండా సురేఖ కేసీఆర్‌ను కోరారు. కేసీఆర్ , ఆయన సతీమణి శోభమ్మకు తల్లుల ప్రసాదమైన బెల్లం , పట్టు వస్త్రాలను అందజేసి అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లను ఆహ్వానించానని, అయితే కేసీఆర్ అందుబాటులో లేకపోవడంతో నేరుగా ఆయన నివాసానికే వచ్చి ఆహ్వానిస్తున్నట్లు మంత్రి సీతక్క ఈ సందర్భంగా తెలిపారు.

**ఆడబిడ్డల గౌరవం - కేసీఆర్ స్పందన**

మంత్రులు తన నివాసానికి వచ్చిన క్రమంలో కేసీఆర్ వారికి సాదర స్వాగతం పలికారు. ఆహ్వానాన్ని మన్నించడమే కాకుండా,

మిగతా 2లో

### కుక్కల కన్నా పిల్లలు బెటర్



- జనసంచార ప్రాంతాలను కుక్కలు లేని ప్రాంతాలుగా మార్చాలి
- సుప్రీం కోర్టు ఆదేశం

వివరాలు 2లో

### రెండేళ్లలో వేయికోట్లతో అభివృద్ధి

02



- మళ్ళీ అధికారం కాంగ్రెస్ పార్టీదే
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

### దేశంలో జనగణనకు రంగం సిద్ధం



- ఏప్రిల్ 1 నుంచి తొలిదశ ప్రారంభం
- కేంద్ర హోంశాఖ వెల్లడి
- తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు గృహాల లిస్టింగ్!

వివరాలు 2లో

### మునిసిపోల్స్ పై మేడారం జాతర ఎఫెక్ట్




- జనవరి 26 తర్వాత షెడ్యూల్?
- ఫిబ్రవరి 15 తర్వాత ఎలక్షన్

02

## దాడులు జరుగుతుండగా
# మమతా బెనర్జీ డేర్
### ఐప్యాక్ చీఫ్ ఇంటికి సీఎం

**మహా :** రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు చేపట్టింది. ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసం సహా ఐప్యాక్‌కు సంబంధించిన పలు ప్రాంగణాల్లో గురువారం ఉదయం నుంచి సోదాలు జరుపుతోంది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా కోల్‌కతా సహా పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ సోదాలు జరుగుతున్న సమయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రతీక్ జైన్ నివాసానికి వెళ్లడం సంచలనంగా మారింది. ఈడీ అధికారులు జైన్ నివాసంలో తనిఖీలు చేస్తుండగా మమతా బెనర్జీ, కోల్‌కతా పోలీసు కమిషనర్ మనోజ్ వర్మ అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా దీదీ మాట్లాడుతూ.. ఈ సోదాలు రాజ్యాంగవిరుద్ధమని మండిపడ్డారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఈ తనిఖీలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ''మా పార్టీ రాజకీయ వ్యూహం, అభ్యర్థుల జాబితా, రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకే ఈడీతో ఈ దాడులు చేయిస్తున్నారు. టీఎంసీ పార్టీ హార్డ్‌డిస్క్‌ను తీసుకునేందుకు ఈడీ అధికారులు ప్రయత్నిస్తున్నారు'' అని బెంగాల్ సీఎం ఆరోపించారు. ఈడీ దాడులు జరుగుతుండగా ప్రతీక్ జైన్ నివాసానికి సీఎం వెళ్లడంపై పశ్చిమబెంగాల్ ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు సువేందు అధికారి అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇది దర్యాప్తులో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడమే అవుతుందన్నారు. ఈ పరిణామాలు బెంగాల్ రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి.

# ఫిబ్రవరి 1న నిర్మలమ్మ బడ్జెట్
### 9వ సారి దేశ ఆర్థిక బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించబోతున్న తెలుగింటి కోడలు
### రూ. 12 లక్షల కోట్ల వరకు ఉండనున్న బడ్జెట్.. ఈ సమావేశాల్లోనే పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపే అవకాశం



**న్యూఢిల్లీ, మహా :** దేశ ఆర్థిక గమనాన్ని నిర్దేశించే 202627 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ ముహూర్తం ఖరారైంది, జన వరి 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అయితే ఎప్పటిలాగే ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ ఉభయ సభల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 2017 నుంచి ప్రతీ ఏడాది ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ఫిబ్రవరి 1న ఆది వారం వచ్చినా సాంప్రదా యాన్ని కొనసాగించేలా ఆదివారం కూడా సభను నిర్వహించబోతున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, వరుసగా 9 వ సారి దేశ ఆర్థిక బడ్జెట్ ప్రవేశపెట్టి సరికొత్త రికార్డుసృష్టించ బోతున్నారు. ఈసారి బడ్జెట్ అంచనాలు గతంతో పోలిస్తే భారీగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా మూలధన వ్యయం సుమారు రూ. 11 నుండి 12 లక్షల కోట్ల వరకు ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రైల్వే లు,జాతీయ రహదారులు, పోర్టుల, అభివృద్ధికి సింహభాగం నిధులు కేటాయించే ఛాన్స్ ఉంది. ప్రతీసారి బడ్జెట్ సమావేశాలు రాష్ట్రపతి ప్రసంగంతో ప్రారంభమవుతాయి. ఆ సంప్రదాయం ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగుతోంది. ఈ సారి కూడా అదే పాటించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రవేశ పెట్టిన పథకాలు, జరిగిన అభివృద్ధి, రాబోయే రోజుల్లో ప్రవేశ పెట్టబోయే పథకాల గురించి వివరిస్తారు. ఫిబ్రవరి 1న నిర్మలా సీతారామన్ ఉదయం 11 గంటలకు పార్లమెంట్ లో బడ్జెట్ ప్రసంగం మొదలు పెడతారు.ఈ సారి బడ్జెట్ సమావేశాల్లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వ హించే దిశగా రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టి ఛాన్స్ ఉంది దీంతో పాటు వ్యవసాయ రంగంలో నాణ్యమైన విత్తనాల లభ్యత కోసం పాత చట్టాల స్థానంలో కొత్త విత్తన బిల్లును తీసుకురానున్నారు. మహిళల కోసం కొత్త పథకాలు ప్రకటించే అవకాశం.30 రోజులకు పైగా జైలు జీవితం గడిపితే సీఎంలు, మంత్రులను తొలగించే బిల్లును కూడా ప్రవేశ పెట్టనున్నారని సమాచారం. అంతర్జాతీయ పరిణామాలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న క్రమంలో ఈ సారి బడ్జెట్ లో పలు కొత్త పథకాలు ఉండే అవకాశముందని తెలుస్తోంది. అలాగే పారిశ్రామిక వర్గాలకు ప్రయోజనం చేకూర్చే పలు నూతన సంస్కరణలు ఉంటాయని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. బడ్జెట్ అనగానే ఇన్‌కమ్ ట్యాక్స్ మిన హాయింపులు, శ్లాబుల మార్పు గురించి ఎక్కువ చర్చ జరుగుతూ ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఐటీ చట్టం అమల్లోకి రాబోతుంది. దీంతో ఆదాయపు పన్ను పరంగా ఎలాంటి మార్పులు జరుగుతాయనేది ఆసక్తికరంగా మారింది.

## మునిసిపోల్స్ పై మేడారం జాతర ఎఫెక్ట్
### జనవరి 26 తర్వాత షెడ్యూల్?.. ఫిబ్రవరి 15 తర్వాత ఎలక్షన్

**హైదరాబాద్ - మహా:**
మునిసిపల్ ఎన్నికలు ఫిబ్రవరి మూడోవారంలో ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. జనవరి 16న షెడ్యూల్, జనవరి 18 నుండి నామినేషన్లు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండగా, జనవరి 26 తర్వాతే షెడ్యూల్ ఉండొచ్చని ప్రభుత్వవర్గాలు భావిస్తున్నాయి. ఇందుకు మేడారం జాతరను కారణంగా చెబుతున్నాయి. వాస్తవానికి మునిసిపల్ ఎన్నికలకు అధికారయంత్రాంగం అంతా సిద్దంగా ఉన్నా, తెలంగాణ ప్రాంతంలోనే అత్యంత ప్రసిద్ధ జాతర.. మంచిర్యాల నుండి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, మెదక్, ఖమ్మం జిల్లాల్లో పెద్ద ఎత్తున జాతర్లకు తరలివెళ్ళడంతో పాటు ఆయా జిల్లాల్లో పూర్తిగా ట్రాఫిక్ నిలిచి.. రెండు, మూడు రోజులు కదలలేని పరిస్థితులు ఉంటాయి. తెలంగాణ, ఛత్తీస్ గడ్, ఒడిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుండి కూడా భక్తులు భారీగా వస్తుంటాయి. ఎపుడూ కోటిమందికి పైగా హాజరయ్యే జాతరకు పునరుద్ధరణ తర్వాత జరుగుతుండడంతో ఈసారి మరింత ట్రాఫిక్ పెరగనుంది. ప్రజల మూడ్ అంతా జాతర మీదే ఉంటుంది. జనవరి 2831 మధ్య జాతర ఉండనుండగా, జనవరి 31 లేదా ఫిబ్రవరి 1న షెడ్యూల్ వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 20లోగా ఎన్నికలు పూర్తయ్యే అవకాశాలున్నాయి.

## బాగున్నారా.. అమ్మా..!



**(మొదటిపేజీ తరువాయి)**

తెలంగాణ సంప్రదాయం ప్రకారం అతిథులుగా వచ్చిన మంత్రులకు కేసీఆర్ దంపతులు చీరలను బహుకరించి గౌరవించారు. తన ఆహ్వానానికి కేసీఆర్ సానుకూలంగా స్పందించారని, జాతరకు తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారని సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయాలకు అతీతంగా, తెలంగాణ ఆడబిడ్డలుగా తాము చేసిన ప్రయత్నమని ఆమె పేర్కొన్నారు.

**రాజకీయాలకు అతీతంగా జాతర**

ఇది రాజకీయాలు మాట్లాడుకునే సమయం కాదు అని మంత్రులు స్పష్టం చేశారు. మేడారం జాతర అనేది రాష్ట్ర పండుగ అని, సమ్మక్కసారలమ్మ తల్లులు ప్రాంతాలకు అతీతంగా అందరి కోర్కెలు తీరుస్తారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు ములుగు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్, సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు ఆకాంక్ష రెడ్డి కూడా పాల్గొని కేసీఆర్‌ను కలిశారు. ప్రభుత్వపరంగా జాతర ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయని, విపక్ష నాయకులందరినీ కలుపుకుని పోవడమే తమ ఉద్దేశమని మంత్రులు వెల్లడించారు.

# దేశంలో జనగణనకు రంగం సిద్ధం
### ఏప్రిల్ 1 నుంచి తొలిదశ ప్రారంభం.. కేంద్ర హోంశాఖ వెల్లడి
#### తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు గృహాల లిస్టింగ్!



**న్యూఢిల్లీ,మహా:** దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో జరగనున్న జనగణనకు రంగం సిద్ధమైంది. దేశంలో జనగణన తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఇళ్ల వివరాలను సేకరించనున్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రతి రాష్ట్రానికి 30 రోజుల వ్యవధి ఉంటుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పదేళ్లకో సారి దేశవ్యాప్తంగా నిర్వహించే జన గణన 2021లో చేపట్టాల్సి ఉండగా, కొవిడ్ కారణంగా వాయిదా పడింది. తాజాగా దీనిని చేపట్టాలని నిర్ణయించిన కేంద్రం రెండు దశల్లో నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. తొలిదశలో గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబరు), రెండో దశలో జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి మార్చి 1)ను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ఇది వరకే స్పష్టం చేసింది. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు, జనగణనతోపాటే కుల గణనను కూడా చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే వెల్లడించింది.

**ప్రీ-టెస్ట్‌లో ముమ్మర కసరత్తు!**

అంతకుముందు యావత్ దేశంలోని ఇళ్ల వివరాలను ఎలా సేకరించాలి? ఇందుకోసం ఏ విధమైన మార్గదర్శకాలను అనుసరించాలి? మానవ వనరులను ఎలా మోహరించాలి? అనే దానిపై ప్రీటెస్ట్‌లో ముమ్మర కసరత్తు చేశారు. పారదర్శకంగా ఇళ్ల వివరాల సేకరణకు అనుసరించాల్సిన మార్గాలపై అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, ఉప జిల్లాల స్థాయిలోని అధికార వర్గాలతో లోతుగా చర్చలు నిర్వహించారు. ఇళ్ల సమాచారాన్ని సేకరించడానికి లక్షలాది మానవ వనరులను మోహరించడంపైనా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశామని అధికార వర్గాలు ఇప్పటికే వెల్లడించాయి. డిసెంబరు ప్రారంభంలోనే ప్రీటెస్ట్ ముగిసిందని తెలిపాయి. దీన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరినీ భారతదేశ రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అభినందించారని పేర్కొన్నాయి.

**తొలి విడతకు కార్యాచరణ ప్రణాళిక**

'గృహాల లిస్టింగ్, గణన' కోసం ఏప్రిల్ నుంచి దేశంలోని ప్రతీ ఇంటిని క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎలా చేరుకోవాలి? ఇంటి యజమానులను ఏయే ప్రశ్నలు అడిగి, ఎలాంటి సమాచారం సేకరించాలి? మొబైల్ యాప్‌ను ఎలా వాడాలి? డిజిటల్‌గా సమాచారాన్ని నమోదు చేసే క్రమంలో ఉపయోగపడే భద్రతా ఫీచర్లు ఏమిటి? సిబ్బందిని రాష్ట్ర, జిల్లా, ఉప జిల్లా స్థాయుల్లో ఎలా వినియోగించాలి? అధికారులు ఎలా సమన్వయం చేసుకోవాలి? అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవడానికి ఇటీవలే జరిగిన ప్రీటెస్ట్ ప్రక్రియ దోహదపడిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

**ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఆర్‌జీఐ కీలక నిర్ణయాలు**

ప్రీటెస్ట్ సందర్భంగా చాలా అంశాలపై ఫీడ్‌బ్యాక్‌ను సేకరించారు. అన్ని స్థాయిల అధికారులు తమ ఫీడ్‌బ్యాక్‌ను ఇచ్చారు. వాటన్నింటిపై అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సెన్సస్ డైరెక్టర్ల సమక్షంలోనే సమీక్ష జరిగింది. అందరి నుంచి సలహాలు, సూచనలను స్వీకరించారు. 'గృహాల లిస్టింగ్, గణన' ముగిశాక రెండో విడత జనగణన ప్రారంభమవుతుంది. ఇందులో భాగంగా మనదేశంలోని మంచుమయ ప్రాంతాల్లో జనాభా లెక్కల ప్రక్రియను 2026 సెప్టెంబరు నుంచి అక్టోబరు 1 వరకు నిర్వహించనున్నారు. మంచుమయ ప్రాంతాల జాబితాలో జమ్ముకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు ఉన్నాయి. దేశంలోని అన్ని ఇతర ప్రాంతాల్లో జనగణన 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 వరకు జరుగుతుంది.

# ఉపాధి హామీని రద్దుచేసే కుట్ర
### ప్రధాని మోదీపై సీఎం రేవంత్ ధ్వజం
### గ్రామగ్రామాన తీర్మానాలు.. జిల్లాల్లో బహిరంగ సభలు
### పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులకు బాధ్యతలు
### ములుగు సభకు సోనియా లేదా రాహుల్ ను ఆహ్వానించాలని నిర్ణయం




**(మొదటిపేజీ తరువాయి)**

ఉపాధి హామీని రద్దు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరుగుతాయని, గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరిగితే కార్పొరేట్ కంపెనీలకు చవకగా కార్మికులు దొరుకుతారని వెల్లడించారు. కార్పొరేట్ కంపెనీలు ఉపాధి హామీ చట్టాన్ని రూపుమాపే కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. పేదలకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు.

### ఈనెల 20నుండి గ్రామాల్లో తీర్మానాలు

గతంలో వ్యవసాయంపై కుట్ర చేశారని, రైతు వ్యతిరేక నల్ల వ్యవసాయ చట్టాలు తయారుచేశారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పోరాటం వల్ల నల్ల వ్యవసాయ చట్టాలు రద్దు చేశారని తెలిపారు. పేదలను బానిసలుగా మార్చేందుకు నూతన చట్టం చేస్తున్నారని, పేదలకు వ్యతిరేకంగా వీబీజీ రామ్‌జీ చట్టం తీసుకొచ్చారని అన్నారు. వీబీజీ రామ్‌జీ చట్టం రద్దు చేసే వారికి పోరాటం చేస్తామని, వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అసెంబ్లీ తిరస్కరించిందని, వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తిరస్కరిస్తూ గ్రామసభలు తీర్మానించాలని కోరారు. ప్రతీ గ్రామంలో తీర్మానం చేయాలని,ముఖ్యనాయకులు ఒక్కో మండలాన్ని దత్తత తీసుకుని గ్రామాల్లో తీర్మానాలు చేయించాలన్నారు. తాను కూడా ఒక మండలానికి ఇన్ ఛార్జిగా ఉంటానన్నారు. మండలాల వారీగా ముఖ్యనాయకులకు బాధ్యతలు అప్పగించాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా రాష్ట్ర మంత్రులకు బాధ్యతలు అప్పగించాలన్నారు.

### ఫిబ్రవరి 3 నుండి జిల్లాల్లో సభలు

ఫిబ్రవరి నుండి తాను రోజుకో జిల్లాలో పర్యటిస్తానని, రామ్ జీ చట్టం రద్దుచేసి నరేగా కొనసాగించాలని జిల్లాకు లక్షమందితో సభలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ సభలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇన్ ఛార్జిగా వ్యవహరిస్తారన్నారు. ములుగు లో బహిరంగ సభ పెట్టి సోనియా, రాహుల్ గాంధీ లను ఆహ్వానిస్తామన్నారు. సీతక్క ఆధ్వర్యంలో ములుగు నియోజకవర్గంలో వేయికోట్ల నిధులతో పనులు సాగుతున్నాయన్నారు. రాష్ట్రస్థాయిలో తీర్మానాల కార్యక్రమాన్ని మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యవేక్షిస్తారన్నారు. త్వరలో మునిసిపల్ ఎన్నికలు రాబోతున్నాయని వీటికి సన్నద్ధం కావాలన్నారు. 2023 నుండి కొనసాగుతున్న జైత్రయాత్రను 2026లోనూ కొనసాగించాలన్నారు.

### ఎస్ఐఆర్ వెనక పెద్ద కుట్ర

2024 ఎన్నికల్లో తమకు 400 సీట్లు ఇవ్వాలని బీజేపీ నేతలు ప్రచారం చేశారని సీఎం గుర్తు చేశారు. బీజేపీకి 400 సీట్లు ఇచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేసేవారని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా పేదల హక్కులు కాలరాయాలని చూశారని, కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడం వల్ల బీజేపీకి సీట్లు తగ్గాయని, బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని తెలిపారు. 400 సీట్లు రాకపోవడం వల్ల రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందని, రాజ్యాంగాన్ని మార్చలేకపోయారు కానీ వేరే రూపంలో హక్కులు కాలరాస్తున్నారని పేర్కొన్నారు. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారని, ఓటు హక్కు పోతే ఆధార్ కార్డు, సంక్షేమ పథకాలు పోతాయని, ఎస్ఐఆర్ వెనక పెద్ద కుట్ర ఉందని సీఎం అన్నారు. సమావేశంలో మంత్రులు, సలహాదారులు, నేతలు పాల్గొన్నారు.

## కుక్కల కన్నా పిల్లులు బెటర్


- జనసంచార ప్రాంతాలను కుక్కలు లేని ప్రాంతాలుగా మార్చాలి
- సుప్రీం కోర్టు ఆదేశం

**ఢిల్లీ:** దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న వీధి కుక్కల దాడులు, కుక్క కాటు సంఘటనలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు గురువారం మరోసారి విచారించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల బెడదపై చర్చ జరుగుతున్న సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. 'కుక్కలతో ఇన్ని బాధలు ఉన్నప్పుడు వాటిని ఎందుకు పెంచుకుంటున్నారు?. వాటి బదులు పిల్లులను పెంచుకోండి. కనీసం అవి ఎవరిపై దాడి చేయవు కదా' అని చమత్కరించింది. ఇంట్లో ఎలుకలను నియంత్రించడంలో పిల్లులు సహాయపడతాయని కోర్టు పేర్కొంది. వీధి కుక్కలకు ఆహారం పెట్టే వాళ్లు.. వాటి వల్ల ప్రమాదాలు ఎదుర్కొంటున్న సాధారణ ప్రజల మధ్య జరుగుతున్న వాదనలను వింటున్న సందర్భంలో ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కుక్కల మూడ్ ఎప్పుడు ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. అవి ఎప్పుడు దాడి చేస్తాయో ఎవరూ ఊహించలేరని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కుక్క కాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. రేబీస్ వల్ల ప్రాణాలకు ముప్పు ఉందని కోర్టు అభిప్రాయపడింది. వీధి కుక్కలపై ప్రేమ ఉండొచ్చు.. కానీ వాటి వల్ల మనుషులకు ప్రమాదం ఉండకూడదు స్పష్టం చేసింది. కుక్కలు భయపడే మనిషి వాసనను పసిగట్టగలవు, ఆ విషయాన్ని గ్రహించినప్పుడు వాళ్లపై దాడి చేస్తుంది. ఇది వ్యక్తిగత అనుభవం నుంచి మాట్లాడుతున్నామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వీధి కుక్కల నుంచి ప్రజలకు, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు, ఆసుపత్రులకు వచ్చే రోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కోర్టు పేర్కొంది. పాఠశాలలు, కోర్టు ప్రాంగణాలు, హాస్పిటల్స్, ఎక్కువగా జనసంచారం ఉన్న ప్రదేశాలను కుక్కలు లేని ప్రాంతం గా మార్చాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది.



## రెండేళ్లలో వేయికోట్లతో అభివృద్ధి
### మళ్ళీ అధికారం కాంగ్రెస్ పార్టీదే
### నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

**నాగర్‌కర్నూల్, మహా:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, గత రెండేళ్లలో దాదాపు వేయి కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ఎండబెట్ల వద్ద హై లెవల్ బ్రిడ్జికి 10కోట్లు, సీసీ రోడ్లకు 20కోట్ల రూపాయలు, బస్టాండుకు 12కోట్లు, సిర్సవాడ బ్రిడ్జికి 20కోట్లు, యంగ్ ఇండియా స్కూల్ కు 200కోట్లు, అసంపూర్తిగా ఉన్న మార్కండేయ రిజర్వాయర్ కు 25కోట్లు మంజూరు చేయించి ప్రారంభించామన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలు పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తానన్నారు. అలాగే స్త్రీశక్తి భవన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలభవనం, అలాగే ప్రజల కోరిక మేరకు ఆర్టీఏ కార్యాలయం మార్చామన్నారు. ముస్లింల షాదీఖానా కోసం 3కోట్లకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు త్వరలో మంజూరు అవుతాయన్నారు. తెల్కపల్లికి డిగ్రీ కళాశాల మంజూరు అయ్యిందని అన్నారు. అన్ని మండలాల్లో అభివృద్ధి జరిగేలా చూస్తామన్నారు. ఈ రెండేళ్లలో నియోజకవర్గంలో దాదాపు వేయి కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 45కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టామని అన్నారు. పెద్ద ఎత్తున చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. అలాగే ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం, పింఛన్లులాంటి ప్రభుత్వ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు నాగర్‌కర్నూల్ నుండి తరలిపోయిన బీసీ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను తిరిగి ఇక్కడికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఎలాంటి కార్యక్రమాలు ఉన్నా తాను పాల్గొంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8,9,10తరగతులు చదివే విద్యార్థులకు తమ ఫౌండేషన్ ద్వారా (షూస్)బూట్లు అందిస్తామన్నారు. వట్టెం పంపు హౌజ్ కు కరెంటు మంజూరు చేయించామని, నిర్వాసితులకు ఆర్థిక శాతం అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఇంటి పోరుతో కేటీఆర్ సీఎం రేవంత్ ని విమర్శిస్తున్నారన్నారు. తనకంటే ముందు రేవంత్ సీఎం కావడాన్ని కేటీఆర్ జీర్ణించుకోవడం లేదన్నారు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా రేవంత్ సీఎం అయ్యారన్నారు. కేటీఆర్ ముందు ఇంటి పంచాయతీ తేల్చుకోవాలని, ఇంటి ఆడపడుచు కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి లేదన్నారు. బల్లగుద్ది చెప్తున్నా రాష్ట్రంలో, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో మళ్ళీ కాంగ్రెస్ పార్టీదే అధికారం అన్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



## నేను కారణజన్మురాలిని
### నా పేరు చెప్పుకుని బతుకుతున్నారు
### అనసూయ సంచలన కామెంట్స్

**మహా :** స్వేచ్ఛ మనకు మనం ఇచ్చుకునేదని, స్వాతంత్ర్యం బయట నుంచి వచ్చేదని నటి, వ్యాఖ్యాత అనసూయ అభిప్రాయపడ్డారు. ఇన్‌స్టా వేదికగా ఆమె అభిమానులతో ముచ్చటించారు. పలు ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. అభిమానంతో తన దగ్గరకు వచ్చేవారితో చక్కగా మాట్లాడతానని, కానీ, ఇటీవల 'ఫ్యాన్స్ అసోసియేషన్' అంటూ వస్తున్న వ్యక్తులెవరో తనకు తెలియదన్నారు. ఆయన మాటలు కూడా తనకు నచ్చలేదని తెలిపారు. నా పేరు వాడుకుని వాళ్లు బతుకుతున్నారు. ఈ చర్చలో ఉన్న వాళ్లంతా పర్సనల్‌గా నన్ను కలవలేదన్నారు. మీ శక్తి, సమయాన్ని ఇలాంటి వివాదాలకు ఉపయోగించడం సరైనదేనా? అంటూ ప్రశ్నించగా,కొందరు నన్ను ఇలాంటి వ్యవహారాల్లోకి లాగినప్పుడు నన్ను నేను కూడా ఇలాగే ప్రశ్నించుకుంటా. కానీ, ఇది డెస్టినీ. నేను కారణజన్మురాలినని అనుకుంటా. నేను ఏదైనా పాజిటివ్‌గా తీసుకుంటా. నా అభిప్రాయం తప్పకుండా చెబుతా. డీల్ చేయాల్సిన వాళ్లు ఉంటే చేస్తా. లేకపోతే, వాళ్లే పోతారు. అని అనసూయ బదులిచ్చింది.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి



**కరీంనగర్ మహా:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ విభాగం చైర్మన్ గా నియామకమైన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం హైదరాబాద్ లో బిజీ బిజీ గా గడిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా మాదిక సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు వేముల వీరేశం కాలే యాదయ్య, ప్రొఫెసర్ ఖాసిం తదితరుల తో వెంట వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను కలిసి శాలువాతో సన్మానించారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పలువురు పార్టీ నాయకులను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువాలు కప్పి వారిని సన్మానించారు.



## పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కలిసిన
# మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి..



**మహా:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్ పర్సన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం హైదరాబాదులో టీపీసీసీని కలిసి సన్మానించి బొకేని అందించారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కి తన పేరు ప్రతిపాదించినందుకు, తనపై నమ్మకంతో రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్పర్సన్ పదవిని అప్పగించినందుకు ఆయన మహేష్ కుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీగిరి రంగారావు ఉన్నారు.

**కంగ్రాట్యులేషన్స్ ఎమ్మెల్యే సాబ్..**

హైదరాబాద్ అసెంబ్లీ ప్రాంగణంలో టిపిసిసి ఎస్సీ సెల్ చైర్ పర్సన్ గా నియమితులైన మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదవాని లక్ష్మీనారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు,డీసీసీ ఇన్చార్జి గోపు మల్లారెడ్డి,జిల్లా కార్యదర్శి మామిడి అనీల్ కుమార్, నర్సింగాపూర్ సర్పంచ్ పెరుక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్ ను
# పరిశీలించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**భువనగిరి, మహా:** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యం లో లో భువనగిరి మండలం దివ్య బాల స్కూల్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ & రిసెప్షన్ సెంటర్ ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మరియు రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు గురువారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో కీలక మైన కౌంటర్లు, సామగ్రి పంపిణీ ఏర్పాట్లు, రిసెప్షన్ డెస్కులు, నియంత్రణ గదులు, భద్రతా చర్యలు, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలను అదనపు కలెక్టర్ సంబంధిత అధికారుల ను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ....



ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా సమయపాలనతో పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ కమీషనర్ రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

### టియుజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి

**వలిగొండ, మహా:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ టి యు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి అన్నారు గురువారం వలిగొండ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ఈనెల 10న సూర్యాపేటలో జరుగు



భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్.ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ రాష్ట్ర నాయకులు మోహన్ బైరాగి చార్వాక బాకారం లావణ్య పబ్బులక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటం



### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా:** సమయం చాలా విలువైనదని, విద్యార్థినీ,విద్యార్థులు కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో 10 వ తరగతి విద్యార్థులకి వార్షిక పరీక్షల కోసం ప్రత్యేకంగా సిద్ధం చేసిన మెటీరియల్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్.. పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు అనగానే మొదటగా భయపడతారని అలాంటి భయాలు ఏమి పెట్టుకోకుండా,ఈ మెటీరియల్ చదివితే పాస్ అవుతారని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో పదవ తరగతి అనేది చాలా ముఖ్యమైన మలుపు అని,ఇక్కడ పాస్ అయితే పై ఉన్నత చదువులకు వెళ్ళడానికి ఆస్కారం ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు చదువు తో పాటు జీవితంలో ఎలా స్థిరపడాలో నేర్పిస్తుందని అన్నారు.పదవ తరగతి విద్యార్థులు అందరూ కూడా ఫోన్ లకి, సోషల్ మీడియా కి టీవీ లకి బానిస కాకుండా పుస్తకాలపై శ్రద్ధ పెట్టాలన్నారు .వార్షిక పరీక్షల వరకు రోజు ఉదయం 4 గంటల లేచి చదవడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు హిత బోధ చేశారు.జిల్లాలోని మారుమూల ప్రాంతమైన ఈ గ్రామంలో ఇంత మంచి కార్యక్రమం చేపట్టిన నేస్తం ఫౌండేషన్ వారికి కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# ఏఎన్ఎన్ తెలుగు క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ ,మహా:** ఏఎన్ఎన్ తెలుగు న్యూస్ ఛానల్ నూతన సంవత్సర క్యాలెండర్ ను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. మక్తల్ నియోజకవర్గ ఏఎన్ఎన్ ఛానల్ రిపోర్టర్ అంజయ్య, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పాత్రికేయులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ ఏఎన్ఎన్ ఛానల్ ప్రజల పక్షాన నిలుస్తూ సామాన్యుల గళంగా మారిందన్నారు. ఏఎన్ఎన్ మంచి వార్తలతో తక్కువ కాలంలో ప్రజాదరణ చూరగొందన్నారు.

# నల్గొండ ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలనేదే నా సంకల్పం

### సమస్యలు లేని పట్టణంగా నల్గొండను తీర్చిదిద్దుతా.. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**నల్గొండ, మహా :** సమస్యలు లేని పట్టణంగా నల్గొండ ను తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్డు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్గొండ మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అన్నేశ్వర గుట్ట వద్ద అమృత్ 2 పథకం కింద కోటి నలభై ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 1100 కిలో లీటర్ల తాగునీటి ట్యాంకును ప్రారంభించారు. మూడు కోట్ల 14 లక్షల 60000 వ్యయంతో వల్లభరావు చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. లెప్రసీ కాలనీలో 3 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కెవి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు.లతీఫ్ సాబ్ గుట్ట సమీపంలో 50 లక్షల రూపాయల టి ఏ టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో నిర్మించిన ఎస్ ఈ2 యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. 68.83 లక్షల రూపాయల వ్యయంతో సుందరీకరించనున్న మోతికుంట పనులకు శంకుస్థాపన చేశారు. నూతనంగా ప్రారంభించిన ఎస్ ఈ కార్యాలయం వద్ద మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలలో నల్గొండ మున్సిపాలిటీని మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటు చేస్తూ బిల్లు పాస్ చేయడం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ,మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మేలో జరగనున్న మేయర్ ఎన్నికల్లో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు తొలి మేయర్ రానున్నారని ఆయన వెల్లడించారు.

# ఫలించిన ప్రభుత్వ విప్ కృషి

### వేములవాడ గుడి చెరువులో బోటింగ్ ఏర్పాటుకు నిధులు..
### 1 కోటి 40 లక్షలు మంజూరు.. ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
### అసెంబ్లీ లో మాట్లాడిన రెండు రోజుల్లోనే నిధులు..
### సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావుకు విప్ ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు..
### వేములవాడ పట్టణ ప్రజలు, భక్తులు, పర్యాటకుల హర్షం

**కరీంనగర్ మహా :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి ఫలించింది. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పించాలనీ రెండు రోజుల క్రితం అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన విజ్ఞప్తి స్పందించిన ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కోటి నలభై లక్షల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది ప్రభుత్వం. ప్రభుత్వ విప్ కృషి ఫలించి నిధులు మంజూరు కావడంతో వేములవాడ పట్టణ ప్రజలు భక్తులు పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గుడి చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయడం వల్ల వేములవాడ ప్రాంతం ఆధ్యాత్మికపరంగా పాటు పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రూ.1 కోటి 40 లక్షల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వేములవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులకు మరింత ఆహ్లాదకరమైన అనుభూతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గత కొంతకాలంగా ప్రభుత్వాన్ని పలు మార్లు కోరుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ గుడి చెరువులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కూడా గుడి చెరువులో బోటింగ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపగా,రెండు రోజుల క్రితం అసెంబ్లీ లో కూడా ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ గుడి చెరువులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు త్వరలోనే బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీకి అనుగుణంగానే మంగళవారం (Go.RtNo. 10, Dated 07/01/2026)గుడి చెరువులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు కోసం రూ.1.40 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ పత్యేక కార్యదర్శి జయేష్ రంజాన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో వేములవాడ పట్టణ ప్రజలు, ఆలయానికి వచ్చే భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోటింగ్ ఏర్పాటు ద్వారా పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో పాటు పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని వారు అభిప్రాయపడుతున్నారు. వేములవాడ పట్టణంలో ఒక వైపు 150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ,47 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో తాజాగా బోటింగ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం 1 కోటి 40 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడంతో వేములవాడ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. కాగా అసెంబ్లీ లో రాజన్న ఆలయ గుడి చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయాలని కోరిన రెండు రోజుల్లోనే 1 కోటి 40 లక్షల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణ రావుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడ అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని విప్ పేర్కొన్నారు.

# టిక్కెట్ ఎవరికి ఇచ్చినా గెలిపిస్తాం...

## సర్వే ఆధారంగానే టిక్కెట్లు ఇవ్వండి

కలిసికట్టుగా ప్రచారం చేసి కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేస్తాం
గడప గడపకూ వెళ్లి కేంద్రం చేసిన అభివృద్ధిని వివరించి ఓట్లు అడుగుతాం
బీజేపీకి ఓటేయకపోతే కరీంనగర్ ప్రజలకు జరిగే నష్టాన్ని వివరిస్తాం
కేంద్ర మంత్రి బండి సంజయ్ కు బాసటగా నిలిచిన కరీంనగర్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు
టిక్కెట్ విషయంలో రాజీ ప్రసక్తే లేదని తేల్చిన బండి సంజయ్
మా కుటుంబ సభ్యులతో పైరవీ చేయిస్తే టిక్కెట్ కట్.. బీజేపీలో కుటుంబ సభ్యుల జోక్యం ఉండబోదు
గెలుపు గుర్రాలకే సీట్లు ఇవ్వబోతున్నట్లు స్పష్టీకరణ కరీంనగర్, వరంగల్ కు ఉన్న తేడాను వివరించాలని కోరిన బండి సంజయ్

**కరీంనగర్ మహా :** "అన్నా...టిక్కెట్ ఎవరికి ఇచ్చినా మా డివిజన్ లో బీజేపీ అభ్యర్థినే గెలిపిస్తాం. దయచేసి సర్వే ఆధారంగానే టిక్కెట్లు ఇవ్వండి. మాకు టిక్కెట్ రాకపోయినా నారాజ్ కాబోం. రెబల్ గా పోటీ చేయబోం. కలిసికట్టుగా ప్రచారం చేసి కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేస్తాం'' అంటూ కరీంనగర్ కార్పొరేషన్ కు చెందిన బీజేపీ నాయకులంతా ముక్తకంఠంతో నినదించారు. ఈరోజు కరీంనగర్ లోని రేకుర్తి శుభం గార్డెన్స్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ అధ్యక్షతన కరీంనగర్ కార్పొరేషన్ బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు, కోమాల ఆంజనేయులు, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ సంక్రాంతి తరువాత ఏ క్షణమైనా మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీకి మంచి వాతావారణం ఉందని, ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని చెప్పారు. టిక్కెట్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. తాను ఎవరికీ టిక్కెట్లు ఇస్తానని హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. కొంతమంది తన కుటుంబ సభ్యుల ద్వారా టిక్కెట్లు కావాలంటూ ఒత్తిడి చేయిస్తున్నారని, అలాంటి వారికి టిక్కెట్ ఇవ్వబోనని తేల్చి చెప్పారు. బీజేపీలో కుటుంబ సభ్యుల జోక్యం ఉండబోదని స్పష్టం చేశారు. టిక్కెట్ల కేటాయింపులో ఏయే అంశాలను పరిగణలోకి తీసుకోవాలో సూచనలు ఇవ్వాలని ఈ సందర్భంగా నాయకుల నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన నాయకులంతా "టిక్కెట్ ఎవరికి ఇచ్చినా మా డివిజన్ లో బీజేపీ అభ్యర్థినే గెలిపిస్తాం. దయచేసి సర్వే ఆధారంగానే టిక్కెట్లు ఇవ్వండి. మాకు టిక్కెట్ రాకపోయినా నారాజ్ కాబోం. రెబల్ గా పోటీ చేయబోం. కలిసికట్టుగా ప్రచారం చేసి కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేస్తాం'' చేతులెత్తి ముక్తకంఠంతో నినదించారు. దీంతోపాటు గడప గడపకూ వెళ్లి కేంద్రం చేసిన అభివృద్ధిని వివరించి ఓట్లు అడుగుతామని చెప్పారు. బీజేపీకి ఓటేయకపోతే కరీంనగర్ ప్రజలకు జరిగే నష్టాన్ని వివరిస్తామని తెలిపారు. ప్రజల్లో బీజేపీకి మంచి వాతావరణం ఉన్న నేపథ్యంలో బయట పార్టీల నుండి ఎంతో మంది నాయకులు రావడానికి ప్రయత్నిస్తున్నారని, అందులో అవినీతిపరులను, కబ్జాదారులను మాత్రం చేర్చుకోవద్దని కోరారు.

# నీళ్ల పేరిట కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామా..

### కేంద్ర మంత్రి బండి సంజయ్

**మహా:** కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల పాపాలే... తెలంగాణ ప్రజల పాలిట శాపాలయ్యాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. నీళ్లు నిధులు నియామకాల ట్యాగ్ లైన్ తోనే ఆ రెండు పార్టీలు దోపిడీకి తెరదీశాయని మండిపడ్డారు. క్రిష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం జరగిందని, ఇందులో మొదటి దోషి కాంగ్రెస్సేనని దుయ్యబట్టారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో తెలంగాణకు తీరని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 89వ సెక్షన్ లో పలు ప్రాజెక్టులున్నప్పటికీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రస్తావనే లేదని కుండబద్దలు కొట్టారు. అట్లాంటప్పుడు జాతీయ హోదా ఎట్లా అడిగారని ప్రశ్నించారు. కరీంనగర్ లోని రేకుర్తి శుభం గార్డెన్స్ లో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ నీళ్ల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు తెలంగాణ ప్రజలకు చేసిన మోసాలను ఎండగడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యాంశాలు... గత వారం పదిరోజులుగా నీళ్ల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలాడుతున్నాయి. 6 గ్యారంటీలపై చర్చ జరగకుండా కాంగ్రెస్, అవినీతిపై విచారణ లేకుండా బీఆర్ఎస్ కలిసి నాటకాలాడుతున్నయ్. నిజానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన పాపాలు... తెలంగాణ ప్రజలకు శాపాలైనయ్. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలాడారు. పాలమూరు రంగారెడ్డి విషయంలో బీఆర్ఎస్ తీరుపై ఉద్యమం చేసింది బీజేపీయే. ఆనాడు కాంగ్రెస్ ఎన్నడైనా ఉద్యమాలు చేసిందా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పై ఒత్తిడి తెచ్చి



మెడలు వంచింది బీజేపీయే. తెలంగాణకు అన్యాయం జరగొద్దని అనేక మీటింగ్ లు పెట్టింది కేంద్రమే. తెలంగాణకు నీళ్ల అన్యాయం చేసిన మొట్టమొదటి దోషి కాంగ్రెస్సే. ఉమ్మడి ఏపీలో క్రిష్ణా వాటాలో 811 టీఎంసీలుంటే...ఏనాడూ తెలంగాణకు 200 టీఎంసీలకు మించి నీటిని వాడుకోకుండా ఇక్కడి ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్సే. గోదావరిలో 1486 టీఎంసీల నీటి వాటా ఉంటే....తెలంగాణలో ఎన్నడూ 500 టీఎంసీలకు మించి వాడుకోలేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంపై సీఎం రేవంత్ అబద్దాలాడారు. రాష్ట్ర విభజన యాక్ట్ లోనూ తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్సే. ఏపీ పునర్విభజన యాక్ట్ సెక్షన్ 89 ప్రకారం... రాష్ట్ర విభజన నాటికి నిర్మాణంలో, ప్లాన్ లో ఉన్న నీటి ప్రాజెక్టులపై అభ్యంతరం తెలపొద్దని స్పష్టంగా ఉంది. ఆ సెక్షన్ లో ఏపీలోని 4, తెలంగాణలోని 2 ఆన్ గోయింగ్ ప్రాజెక్టులను పొందుపర్చారు. మరి తెలంగాణలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పొందుపర్చలేదు?. ఆనాడు అధికారంలో ఉన్న ఈ సోకాల్డ్ కాంగ్రెస్ నేతలు ఎందుకు నిలదీయలేదు?. పునర్విభజన యాక్ట్ లోని సెక్షన్ 89లో పాలమూరు ప్రస్తావనే లేనప్పుడు జాతీయ హోదా ఎట్లా అడిగారు?. వైఎస్ పాలనలో పోతిరెడ్డిపాడు ద్వారా ప్రతిరోజు సగటున 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలిస్తే ఎందుకు ఆపలేకపోయారు?. నీళ్ల విషయంలో పదేళ్ల కేసీఆర్ పాలనలోనూ తెలంగాణకు మరణ శాసనమైంది. నీళ్లు నిధులు నియామకాలనే ట్యాగ్ లైన్ పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నరు. కేసీఆర్ సీఎం అయిన కొత్తలో "తెలంగాణకు కేసీఆర్ అనే అణుబాంబు ఉంది.చంద్రబాబు... నీ ఆటలు సాగవ్..''అని డాంబికాలు పలికిండు. అవన్నీ పిట్టల దొర మాటలేనని తేలిపోయింది. ఏపీ ప్రభుత్వానికి అమ్ముడుపోయి ఆనాడు కేసీఆర్ క్రిష్ణా జలాలను తాకట్టు పెట్టిండు. క్రిష్ణా జలాల్లో తెలంగాణకు 575 టీఎంసీల వాటా రావాల్సి ఉంటే... 299 టీఎంసీలకే ఒప్పుకుని సంతకం చేసి దక్షిణ తెలంగాణకు తీరని ద్రోహం చేసిన మోసగాడు కేసీఆర్. ఏపీకి కేసీఆర్ అమ్ముడపోయి అపెక్స్ కౌన్సిల్ సాక్షిగా 299 టీఎంసీల నీళ్లు చాలని చేసిన సంతకాల ఒప్పందాన్ని మొట్టమొదట బయటపెట్టిందే నేను. ఎవరిని అడిగి 299 టీఎంసీల నీళ్లు చాలని ఒప్పుకున్నారు? అదేమైనా కేసీఆర్ జాగీరా? ఇప్పటికీ నోరు మెదపని మూర్ఖుడు కేసీఆర్. తెలంగాణ వచ్చాక పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 4.3 టీఎంసీల నుండి ఏకంగా 13.7 టీఎంసీలకు పెంచినా నోరు మెదపని సన్నాసి కేసీఆర్. ప్రజలను డైవర్ట్ చేసేందుకు "కాళేశ్వరం'' పేరుతో కూలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో దోపిడీకి స్కెచ్ వేసిన నాయకుడు కేసీఆర్. రూ.30 వేల కోట్ల ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచి వేల కోట్లు దోచుకున్న దోపిడీ దొంగ కేసీఆర్. రెండోసారి అధికారం చేపట్టాక పాలమూరు రంగారెడ్డి పేరుతో రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి చుక్క నీరియ్యని దుర్మార్గుడు కేసీఆర్. రూ.80 వేల కోట్ల ప్రతిపాదనలతో రూపొందించిన పాలమూరు ప్రాజెక్టులో భూసేకరణ, డిస్ట్రిబ్యూటరీల అంశాలే లేవు. ఇదేందని నిలదీస్తే.... లక్షన్నర కోట్లతో పాలమూరు రంగారెడ్డి అంచనాలు పెంచి దోచుకోవాలనుకున్నడు. పాలమూరు రంగారెడ్డి పేరుతో కమీషన్లు దండుకోవడమే కేసీఆర్ పనిగా పెట్టుకున్నడు. వేల కోట్లు దోచుకున్నా ప్రజలు రెండోసారి అధికారం అప్పగిస్తే... కేసీఆర్ మరింత బరితెగించారు. క్రిష్ణా జలాల వాటా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలకు మోదీ నాయకత్వం పలుమార్లు ప్రస్తావించి హెచ్చరించినా పట్టించుకోలేదు. నిలదీసిన మమ్ముల్ని పిట్టకథలు చెబుతూ కేసీఆర్ హేళన చేశారు. క్రిష్ణా బేసిన్ లో KWDT2 ప్రకారం... ఉమ్మడి ఏపీ వాటా 1005 టీఎంసీలు ఉన్నాయని, అందులో 600 నుండి 700 టీఎంసీల వరకు నీళ్లను వాడుకునే అవకాశం తెలంగాణకు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సరైన వాదనలు విన్పిస్తేనే ఇది సాధ్యమవుతుందని చెప్పినా కేసీఆర్ పెడచెవిన పెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంవల్ల క్రిష్ణా నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందంటూ కేంద్రం అనేక సార్లు హెచ్చరించింది. నీళ్ల విషయంలో పాలకుల తప్పిదాలను సరిదిద్దడానికి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ లను ఏర్పాటు చేసింది నిజం కాదా?. కేసీఆర్ పాలనలో ఏపీ ప్రభుత్వం అక్రమంగా సంగమేశ్వర ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించింది నిజం కాదా?. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్... పత్రికల్లో, టీవీల్లో పెద్ద ఎత్తున వార్తలు వచ్చినా పట్టించుకోని మూర్ఖుడు కేసీఆర్.

తెలుగు
మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్
09-01-2025
పురపోరు 2026
04




# ఆదిలాబాద్.. చరిత్ర ఘనం

## గడ్డకట్టే చలిలో.. వేడిపుట్టిస్తున్న రాజకీయాలు

### మునిసిపల్ పీఠంపై ప్రధానపార్టీల కన్ను.. గతంలో బీఆర్ఎస్ సొంతం

### ఈసారి అధికార కాంగ్రెస్ కు అవకాశాలు అధికం.. రిజర్వేషన్లపై టెన్షన్

(మహా ప్రత్యేకం, ఆదిలాబాద్)

ఆదిలాబాద్ పురపాలక సంఘం తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ముఖ్యమైన స్థానిక స్వపరిపాలన సంస్థ. ఈ పురపాలక సంఘం 1956 సంవత్సరంలో ఏర్పడగా, 1998లో మొదటి తరగతి మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయబడింది. జిల్లా కేంద్రంగా ఉన్న ఆదిలాబాద్ పట్టణమే దీనికి పరిపాలనా కేంద్రం. ఆదిలాబాద్ మునిసిపాలిటీ చరిత్ర ఎంతో ఘనమైనది. చరిత్ర పెద్దగా ఉన్నా.. అభివృద్ధిలో గత పాలకులు చిన్న చూపు చూశారన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది.

మున్సిపల్ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్న తరుణంలో ఆదిలాబాద్ పురపాలిక లో ఇప్పటినుండే పలు రాజకీయ పార్టీలు ఆశావహులు పావులు కదుపుతున్నారు. పట్టణంలో ఎవరిని కదిపినా మున్సిపల్ చర్చే నడుస్తోంది. దీంతో అత్యంత చలి వాతావరణంలో సైతం ఎన్నికల ఆలోచనలు వ్యూహాలతో ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు ఆశావహులలో ఎన్నికల వేడి నెలకొంది. ఇప్పటికే గత ఎన్నికల్లో చైర్మన్ పీఠం దక్కించుకున్న జోగు ప్రేమేందర్ తో పాటు ఆయా వార్డులలో గెలిచిన మాజీ కౌన్సిలర్లు సైతం మరోమారు తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామనే ఆలోచనలో ఉన్నారు.అయితే కొద్ది నెలల క్రితమే కొందరు పార్టీలు మారారు. ఇక వీరితో పాటు గతంలో ఓడిన వారు మరో ప్రయత్నంగా బరిలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. ఇక కొత్తవారు బరిలోనిలిచే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఇప్పటినుండే పోటీపై వ్యూహాలు ప్రతివ్యూహాలు సమాలోచనలు పైరవీలతో మున్సిపల్ సీన్ గరంగరంగా కనిపిస్తోంది.

**పోటా పోటీ**

మున్సిపాలిటీలో మొత్తం 49 వార్డులుండగా గత ఎన్నికలలో మెజారిటీ స్థానాలు గెలిచి బీఆర్ఎస్ మున్సిపల్ పీఠాన్ని సొంతం చేసుకుంది. అనంతరం 2023లో జరిగిన శాసన సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తో ఆ పార్టీలోకి వలసలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ మున్సిపల్ పీఠాన్ని హస్తగతం చేసుకునేందుకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ అవకాశాలున్నా బీఆర్ఎస్ బీజేపీలు గట్టి పోటీనిచ్చే అవకాశం కనబడుతోంది.ఇప్పటి నుండే వార్డుల వారీగా ఆశావహులు తమ అభ్యర్థిత్వం పై ఆయా పార్టీల పెద్దలతో మంతనాలు సాగిస్తున్నారు. గత ఎన్నికల్లో ఫెర్మామెన్స్ వార్డుల్లో తమ బలాబలాలు వివరిస్తూ టికెట్ కై పైరవీలు సాగిస్తున్నారు.ఒక వేళ ఆయా పార్టీలు టికెట్ నిరాకరిస్తే సొంతంగా తమ సత్తా చాటేందుకు కూడా వెనుకాడని పరిస్థితి నెలకొంది.

**రిజర్వేషన్ పై దృష్టి**

బల్దియాలో పోటీకి వార్డులు వారీగా చాలా మందే ఆసక్తి కనబరుస్తున్నట్టు సమాచారం. అయితే రిజర్వేషన్లు తమకు అనుకూలంగా రావాలని ఆశిస్తున్నారు..ఫైనల్ ఓటర్ లిస్ట్ రిలీజ్ అయిన తర్వాతనే రిజర్వేషన్లు వెల్లడయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. మున్సిపల్ చైర్మన్ తో పాటు వార్డులకు రిజర్వేషన్ కలిసొస్తే తమ అదృష్టం పరీక్షించుకునేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారు. అటు మూడు ప్రధాన పార్టీలతో పాటు మిగతా రాజకీయ పార్టీలు సైతం ఎవరెవరిని పోటీలో నిలబెట్టాలా బలమైన అభ్యర్థులు ఎవరా అని ఆలోచిస్తున్నాయి. అటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల కోసం కూడా దాదాపు పలు పార్టీలు ఇప్పటికే కొందరి పేర్లు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సారి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక డెరెక్టుగా నిర్వహిస్తారనే ప్రచారం సాగుతోంది.అదే జరిగితే ఓటర్లు రెండు వేర్వేరు బ్యాలెట్ పత్రాలపై ఓటు వేయాల్సి ఉంటుంది. ప్రత్యక్ష పోటీ రసవత్తరంగా మారే అవకాశం ఉండనుంది.ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు పలు సమావేశాల్లో చెప్పినట్టు ఈ సారి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకుంటారా ..?లేదా బీఆర్ఎస్ మరోమారు తన కుర్చీ కాపాడుకుంటుందా..? లేదా బీజేపీ తన ఖాతాలో వేసుకుంటుందా అన్నది ఆసక్తిగా మారింది. అటు గత ఎన్నికల మాదిరిగా పరోక్ష పద్ధతిలో చైర్మన్ గిరి ఎన్నిక జరిగితే మున్సిపల్ పీఠం దక్కాలంటే ఆయా పార్టీలు అత్యధిక స్థానాలలో తమ అభ్యర్థులను గెలిపించుకోవలసి ఉంటుంది. మున్సిపల్ చైర్మన్ కుర్చీని ఆశిస్తున్న అభ్యర్థి తన గెలుపుతో పాటు మెజారిటీ అభ్యర్థుల విజయానికి కూడా కృషి చేయాల్సి ఉంటుంది.

**స్వతంత్రులు కీలక పాత్ర**

మరోవైపు ఈ సారి బల్దియా ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలని అటు రాజకీయ పార్టీలతో పాటు ఇండిపెండెట్లు కూడా ఉవ్విళ్లూరుతున్నారు.అయితే ఏదైనా పార్టీ టికెట్ లేదా స్వతంత్రంగా బరిలో దిగేందుకు వ్యూహాలు రచిస్తున్నట్టు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల లో పార్టీ కంటే కూడా వ్యక్తిగత ఇమేజ్ ఎక్కువగా ప్రభావం చూపుతుంది. కాబట్టి 49 వార్డులలో కొన్ని వార్డులు ఇండిపెండెట్ల ఖాతాలోకి వెళ్లితే వారు కీలకంగా మారే అవకాశం ఉంటుంది. లేదా అంతకు ముందే ఆయా పార్టీల అభ్యర్థులు ఇండిపెండెంట్లను మచ్చిక చేసుకుని లైన్ క్లీయర్ చేసుకుంటారా అనేది కూడా ఆసక్తికరమే.

**తుది జాబితాకు కసరత్తు**

త్వరలో మున్సిపల్ పోరుకు నోటిఫికేషన్ వెలువడనుండడంతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం కసరత్తు ను ప్రారంభించింది. ఈనెల 1నుండి 5వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ల జాబితా ను అందుబాటులో ఉంచింది. అయితే ఓటరు జాబితాలో తప్పులపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు రావడంతో ఆయా వార్డులలో సర్వే నిర్వహించి తుది జాబితా విడుదలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.ముసాయిదా ఓటర్ జాబితాలో అవకతవకలను సరిచేసేందకు పై మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఓటరు వార్డుల తారుమారు, మరణించిన వారి పేర్లు జాబితాలో ఉండటం పై క్షేత్రస్థాయిలో సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించి దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. మృతుల పేర్లు తొలగిస్తూ మిగతా ఓటర్లు స్థానికంగా ఉంటున్నారా లేదా ఇంటి నంబర్లు, ఓటర్ ఎపిక్ కార్డు లను పరిశీలించి విచారించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ఈనెల 12న వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించేందకు కసరత్తు చేస్తోంది. అలాగే 16న తుది జాబితా విడుదల చేయనుంది. రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణికుముదిని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్, అధికారుల యుద్ధప్రాతిపదిక చర్యలు చూస్తుంటే ఈనెల చివరి వారం కల్లా నోటిఫికేషన్ వెలువడే అవకాశముందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

పురపాలక పరిధి విస్తీర్ణం: **50.69** చదరపు కిలోమీటర్లు

| మొత్తం ఓటర్లు: | పురుష ఓటర్లు: | మహిళా ఓటర్లు: |
|---|---|---|
| 1,43,773 | 69,869 | 73,898 |

పురుషుల కంటే మహిళలు: **4,029** మంది అధికం


మొత్తం వార్డుల సంఖ్య: **49**

మున్సిపల్ కమిషనర్: సీవీఎన్ రాజు.. మొత్తం ఉద్యోగులు: **40** మంది




## పురపాలక స్వరూపం

ఆదిలాబాద్ పురపాలక సంఘం తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన స్థానిక స్వపరిపాలన సంస్థ. 1956 లో ఏర్పడి 1998లో మొదటి తరగతికి చెందిన మునిసిపాలిటీగా అప్ గ్రేడ్ చేయబడింది. జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ పట్టణం దీనికి పరిపాలనా కేంద్రం. పురపాలక పరిధి విస్తీర్ణం 50.69 చదరపు కిమీటర్లు. తాజా గణాంకాల ప్రకారం ఆదిలాబాద్ మునిసిపాలిటీలో 1లక్షా43 వేల 773 మంది ఓటర్లు ఉండగా పురుషులు 69వేల 869 మంది. స్త్రీలు 73వేల 898 మంది. పురుషుల కంటే స్త్రీలు 4వేల 29 మంది అధికంగా ఉన్నారు. మొత్తం 49 వార్డులున్నాయి. మున్సిపల్ కమీషనర్ సీవీఎన్ రాజు తో కలిపి పురపాలికలోని అడ్మినిస్ట్రేషన్,ఎస్టాబ్లిష్ మెంట్, ఇంజినీరింగ్,రెవెన్యూ,హెల్త్ అండ్ సానిటేషన్,అకౌంట్స్,టౌన్ ప్లానింగ్, మెప్మా విభాగాలలో మొత్తం 40 మంది ఉద్యోగులు ప్రజలకు సేవలందిస్తున్నారు.



# రాజేంద్రనగర్ సర్కిల్ ని హైదరాబాదులో కలపొద్దు

## మరో ఉద్యమం రూపు దాల్చకముందే.. నిర్ణయానికి వెంటనే వెనక్కి తీసుకోవాలి.. నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి...

**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్ సర్కిల్ ను హైదరాబాదులో కలపవద్దు అంటూ వ్యతిరేకిస్తూ గులాబీ శ్రేణులు అరాంఘర్ చౌరస్తాలో గురువారం నిరసన దీక్షి చేపట్టారు. హైదరాబాద్ వద్దు సైబరాబాద్ ముద్దు అనే నినాదాలతో నిరసన దీక్షిలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి,రాజేంద్ర నగర్ సర్కిల్ బిఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన దీక్షలో పాల్గొన్నారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ చరిత్ర ను చెరపొద్దు రాజేంద్రనగర్ సర్కిల్ హైదరాబాద్ కు మార్చొద్దు, సైబరాబాద్ లోనే కొనసాగించాలన్నారు. తల, తోక లేని విధంగా కాటేదాన్ ను మైలార్దేవపల్లి డివిజన్లుగా మార్చారని డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చౌకబారు నిర్ణయంవల్ల రాజేంద్రనగర్ సర్కిల్ అస్తిత్వం కోల్పోయే ప్రమాదంలో పడిందని ధ్వజమెత్తారు. ఒంటెద్దు పోకడలా నిర్ణయం సరైనది కాదు అభివృద్ధి కుంటుపడుతుందని కార్తీక్ రెడ్డి దుయ్యబట్టారు. జిల్లా ఏర్పడ్డప్పటినుంచి సైబరాబాద్ లో ఉన్న రాజేంద్రనగర్ సర్కిల్ ని ఎలా హైదరాబాదులో కలుపుతారు, ప్రభుత్వం ఈ నిర్ణయాని వెనుకకు తీసుకోకపోతే మరో ఉద్యమం రూపు దాలుస్తుందని ప్రభుత్వంని హెచ్చరించారు.. ప్రజలు నాయకులు ఈ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. శాసనసభ్యులు నిమ్మక నిరెత్తినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఓల్డ్ సిటీలో కలపడాని క్యామిమ్మల్ని నాలుగుసార్లు శాసనసభ్యునుగా గెలిపించింది. ఇలాంటి నిర్ణయాలకు నియోజకవర్గ ప్రజలు ఎలా మద్దతు పలుకుతారాని ప్రశ్నించారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా నే పాలన సాగించాలి. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి ,రమేష్ ముదిరాజ్, పోరెడ్డి ధర్మారెడ్డి,



జీవన్ దాస్, వనం శ్రీరామ్ రెడ్డి , నోముల రాము, అక్యం రాఘవేందర్ యాదవ్ ,ఎడ్లకాడి సూర్యం, జెచిత్తారి,లక్ష్మీ రాజ్, సరికొండ దుర్గేష్, రాజేష్ యాదవ్, ముక్రం ఖాన్, జహీర్ ఖాన్, నయీముద్దీన్, మైసి రెడ్డి, వెంకటరమణ,గంజి రాజు, గుమ్మడి కుమార్, ఎర్లపల్లి ప్రవీణ్, శివారెడ్డి , ప్రసన్న, సరితా, పద్మ, సుగుణ, కొంపల్లి జగదీష్, చిరంజీవి, బాలరాజ్ యాదవ్,నరేష్ యాదవ్, జనాపూర్ సునీల్ ,మహేష్ పాల్గొన్నారు.

# హష్ అయిల్ రూపంలో ఉన్న గంజాయి బాటిల్ ను శంషాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు

## ఇద్దరు వ్యక్తులు అరెస్టు



**రాజేంద్రనగర్, మహా :** హష్అయిల్ రూపంలో ఉన్న గంజాయిని శంషాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఎస్హెచ్ఓ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఊట్ప ల్లి లోని శ్రీకృష్ణ ఆస్పత్రి వద్ద ఇద్దరు వ్యక్తుల కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని వారిని విచారించగా నిందితుల వద్ద హష్ అయిల్ రూపంలో ఉన్న గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రెండు బాటల్లో హష్ అయిల్ ఉంది. ఒక బాటిల్ ఇద్దరు కలిసి సేవించారు. మరో బాటిల్ ను విక్రయించే ప్రయత్నం చేస్తుండగా శంషాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గాజువాక ప్రాంతానికి చెందిన నాగ ప్రవీణ్, గచ్చిబౌలి జెవి కాలనీకి చెందిన ఎర్ర శ్రీనివాసులుగా గుర్తించారు. గోవా వెళ్లిన శ్రీనివాసులు తన స్నేహితునితో హష్ అయిల్ కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు విచారణలో పోలీసులకు తెలిపారు.హష్ అయిల్ ను సిగరెట్ ద్వారా హష్ ఆయిల్ ని సేవించారు. నిందితులపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.







# ట్యాబ్ సిటీకి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి

## సుజీన్ మేడికేర్ కంపెనీని ప్రారంభించనున్నారు .. ప్రజా ఆరోగ్య హబ్ తెలంగాణ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నేడు సీఎం చేతుల మీదుగా సుజీన్ మేడికేర్ ప్రారంభం చేయనున్నారు. ప్రజారోగ్యం కోసం, అత్యవసర వైద్య సదుపాయాలకు తెలంగాణ ప్రాంతం ముఖ్యంగా హైదరాబాద్ హబ్ కానుంది. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలకు పెట్టుబదారులు తోడవడంతో కంపేనీలు ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగా నేడు మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో గల ఫ్యాబ్సిటీలో మనిషా గ్రూప్ ఆఫ్ కంపెనీ సుజిన్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఐవి ద్రవం తయారీ కంపెనీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం 10:30 గంటలకు ప్రారంభించనున్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర పరిశ్రమలు & ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, టీజీ ఐఐసీ చైర్మన్ టి .నిర్మల జగ్గారెడ్డి , చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, మల్రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, టిజిఐఐసి వైస్ ఎండి శశాంక (ఐఏఎస్), డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ షహనావాజ్ ఖాసీం, కేఎల్ఆర్ తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. మనిషా గ్రూప్స్ కంపెనీ ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని దేశంలోనే గొప్పదైన కంపెనీగా స్థాపించే ప్రయత్నం చేస్తుంది. అత్యవసర వైద్యం, ఉపాధి కల్పన , పారిశ్రామిక అభివృద్ధి తదితర అంశాలు ఇందులో మేళవించి ఉన్నాయని కంపెనీ డైరెక్టర్లు ఒక ప్రకటనలో వివరించారు. దక్షిణ భారతదేశంలో అత్యవసర వైద్యం కోసం అవసరమైన ఇంజెక్టబుల్ ఫ్లూయిడ్ (ఐవి) ద్రవం తయారీ కంపెనీ కంపెనీలలో ఇది మొదటిది అవుతుందని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

## ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.. కార్పొరేటర్ తోకల..



**రాజేంద్రనగర్ , మహా :** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్, బృందావన్ కాలనీలలో రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిహెచ్ఎం, హెచ్ఎం డబ్ల్యూ ఎస్, ఎస్ బి, అధికారులతో కలిసి కాలనీలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల మాట్లాడుతూ మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలి. పనులలో అలసత్వం వహిస్తే సహించేది లేదు. జలమండలి అధికారులు ప్రజలకు పెద్ద సమస్యగా మారారు. డివిజన్ పరిధిలో డ్రైనేజ్ వ్యవస్థ సరి చేయాలి. త్రాగు నీటిలో మురుగు నీరు కలుషితం అవుతుందని పలుమార్లు ఫిర్యాదు చేయగా ఇప్పటివరకు సరి చేయాలేదు. వెంటనే సమస్యని పరిష్కరించి ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ ప్రజలకు సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్,రమేష్ రెడ్డి, రావుల భాస్కర్, గోపాల్ నాయక్, మధుసూదన్ రెడ్డి, కుర్మయ్య, చెన్నమ్మ, రమేష్, లింగప్ప, శ్రీశైలం సమేత, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, లోక్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# గాజుల సర్వేశ మృతి పట్ల నేతల సంతాపం



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు పట్టణానికి చెందిన గాజుల సర్వేశ గురువారం ఉదయం తీవ్ర అస్వతగ్గురై అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, మాజీ జెడ్పిటిసి సభ్యులు కండే హరిప్రసాద్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, వివిధ పార్టీల నాయకులు, పద్మశాలి సంఘం నాయకులు వెంకటేశ్వర కాలనీలోని ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించి ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంత నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రమాణాలను ప్రతి ఒక్కరు పాటించాలి




## జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటం

**ఆమనగల్లు, మహా:** రోడ్డు భద్రత ప్రమాణాలను సామాజిక బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరు పాటించాలని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జ్ కాటం స్వరూప అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె న్యాయవాదులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కారు నడిపే వారితో పాటు అందులో ప్రయాణించే వారు సైతం తమ సీటు బెల్టులను వేసుకోవాలన్నారు. జీబ్రా క్రాసింగ్స్ ఉన్నచోట్ల తమ వాహనాలను నెమ్మదిగా నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదన్నారు. వాహనదారులు అంబులెన్స్ లకు తగిన దారి ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేష్,ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్, బార్ అసోసియేషన్ కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, కోశాధికారి కొప్పు కృష్ణ, గ్రంథాలయ సెక్రటరీ వస్పుల మల్లేష్, క్రీడా కార్యదర్శి ఏ శేఖర్, సభ్యులు సీనియర్ న్యాయవాదులు మల్లేష్, మధు గౌడ్,జగన్ గౌడ్, శివ శంకర్ శ్రీనివాస్, శ్రీశైలం, ఆమనగల్లు జూనియర్ కోర్టు సూపరింటెండెంట్ మురళీకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్,కోర్టు సిబ్బంది శివ,ఉమామహేశ్వర్,రవి కిరణ్,మల్లేష్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నేడు ఇబ్రహీంపట్నానికి ఎమ్మెల్యే రంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసిల్దార్ కార్యాలయాన్ని, నేడు ఎమ్మెల్యే రంగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించమన్నారు. అలాగే పట్నంలో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు.

# ముని్సపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురడమే లక్ష్యం

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు నడుం బిగించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చేవెళ్ళ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, ఎన్నికల సమయంలో ఇచ్చిన 'ఆరు గ్యారంటీలు', ఇతర హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు మహాలక్ష్మి పథకం వంటి అంశాల్లో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయంలో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించాలి తెలంగాణలో ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, అభ్యర్థుల విజయం కోసం సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు , వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 40.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- పలు వార్డుల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభివృద్ధి పనులు
- షాద్ నగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా ఎమ్మెల్యే
- షాద్ నగర్ మున్సిపాలిటీలో యువకుల వాహనాల ర్యాలీ



**షాద్ నగర్. మహా:** షాద్ నగర్ లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంట నేతలు, కార్యకర్తలు తండోపతండాలుగా కదలి రాగా పలు వార్డుల్లో ప్రగతి పనులు ప్రారంభమయ్యాయి. ఆయా పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. మొత్తం 40.50 కోట్ల రూపాయలు ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేయగా ఈ సందర్భంగా గురువారం మొత్తం 11 కోట్ల రూపాయలతో పనులు ఆయా కాలనీలలో పనులు ప్రారంభించారు. ప్రభుత్వం టీడీఎస్ 18 కోట్లు, సిడిఎంఏ 3 కోట్లు, యూఐడీఎఫ్ నిధులు, మూడు కోట్లు సీఎం నిధులు, 75 లక్షలు టీయూఎఫ్ ఐ డి సి నిధులు ఉన్నాయి. ఆయా నిధులతో పట్టణంలోని తొమ్మిదవ వార్డులో రూ.3.04 కోట్లతో రెండు సిసి రోడ్లు, భగీరథ కాలనీ పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సీఏస్కే, రాఘవేంద్ర కాలనీ లో రూ,3.50 కోట్ల తో పనులను ప్రారంభించారు. అదేవిధంగా జంగే షాహీద కబరస్తాన్ కొరకు కాంపౌండ్ గోడ కోసం 50 లక్షల రూపాయలతో పనులను ప్రారంభించారు. అదేవిధంగా 26వ వార్డులో రూ.46.41 లక్షలతో సిసి రోడ్డు పనులను, అదేవిధంగా 25 లక్షలతో పార్కు పనులను ప్రారంభించారు. 19వ వార్డులో రూ.22.95 లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభించగా, 27 వార్డులో 69.70 లక్షలతో మరో సిసి రోడ్డును ప్రారంభించారు. ఇక 15వ వార్డులో చాలా కాలంగా అర్ధాంతరంగా నిలిచిపోయిన కమ్యూనిటీ భవనానికి ప్రత్యేకంగా 18 లక్షలు కేటాయించి నిర్మాణం పనులను మొదలుపెట్టారు. 12 వ వారర్ లోను రూ.25.76 లక్షలతో సిసి రోడ్డు పనులను మొదలుపెట్టారు. షాద్ నగర్ ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యం అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలో వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డుల వారీగా వివిధ అభివృద్ధి పనులు చిత్తశుద్ధితో చేపడుతున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వాన్ని నిర్లక్ష్యం వల్ల పురపాలికలో పలు వార్డులు సమస్యల వలయంలో అల్లాడుతున్నాయని, నాసిరకం రహదారులు నిర్మించి కాలనీలలో ఇబ్బందులు సృష్టించారని వెల్లడించారు. పురపాలికలు అనుకున్న అభివృద్ధి సాధించడానికి అవసరమైన నిధులను క్రమమైన విధానంలో తీసుకొస్తున్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రతివార్డుకు అవసరం మేరకు నిధులు తెచ్చి వార్డులను తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మజు మున్సిపల్ చైర్మన్ విశ్వం, రఘునాయక్, జమ్రుద్ ఖాన్, ఇబ్రహీం, అగునూరు బస్వం, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# లేబర్ అడ్డాలపై ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

## డిప్యూటీ కమిషనర్ సుమన్ రావుకు సిపిఐ నాయకుల వినతి



**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి,రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, శంషాబాద్ మండలఏఐటియుసి అధ్యక్షులు అన్నెపు ప్రభు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి జటావత్ నరేష్ తో కలిసి గురువారం శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావుకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి కార్మికులు వలసలు వచ్చి అధిక సంఖ్యలో అడ్డాలపై కూలీలుగా పనులు చేస్తున్నారు. పనులు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక పూట తిని తినక చాలి చాలని కడుపుతో జీవిస్తున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో లేబర్ అడ్డాల దగ్గర ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేస్తే కార్మికులకు పని దొరకలేకపోతే కార్మికులు ఇందిరమ్మ క్యాంటీన్ లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఐదు రూపాయలతో చేస్తారు. పేదవారి కడుపు నింపడానికి ఇందిరమ్మ క్యాంటీన్లు పనికొస్తాయని ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు అనిత, తదితరులు పాల్గొన్నారు.

# వణికిస్తున్న చలి

## పసి పిల్లలు, వృద్ధులకు మొదలైన తిప్పలు..

## జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



**ఆమనగల్లు,మహా :** రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. అర్ధరాత్రి తర్వాత మంచు కురుస్తోంది. చల్లగాలులతో ప్రజలు ఉదయం పూట ఇళ్ల నుంచి బయటకు రావడానికే ప్రజలు జంకుతున్నారు. చలి చంపేస్తోంది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు చల్లటి గాలులు వీస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం, చల్లని గాలులు వీయడంతో చలి తీవ్రత పెరుగుతోంది. చలి తీవ్రం కావడంతో పిల్లలు, వృద్ధులు, అస్తమా ఉన్న వారు ఇబ్బందులకు గురవుతున్నారు.చలితీవ్రత చాలా ఎక్కువగా ఉండ టంతో వృద్ధులు తట్టుకోలేక పోతున్నారు. రైతులు తమ వ్యవసాయ పొలాల వద్దకు ఉదయం సాయంత్రం వెళ్ళాలంటే జంకుతున్నారు. ఉద యం పాఠశాల కళాశాల వెళ్ళే విద్యార్థులు ఉ దయం నుండి సాయంత్రం వరకు చలికోట్లతో ఉంటున్నారు. ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు కొంత ఎండగా ఉండి 3 గంట ల నుంచి చలితీవ్రత, చల్ల గాలులు బలంగా వీస్తున్నాయి. ఈసంవత్సరం చలి తీవ్రత ఎక్కు వగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చె బుతున్నారు. అందుకే పెద్దలు, వృద్ధులు రైతు లు చలిని తట్టుకునే దుస్తులను ధరించాలన్నారు.అలర్జీ, ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఉన్ని దుస్తులను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

### చలి ఉన్నా.. తప్పని పనులు

తెల్లవారుజామునే పాలు, కూరగాయలు విక్రయించే వారు రక్షణ కవచాలు ధరించి కూడా వణుకుతూనే గ్రామాలకు వస్తున్నారు. పట్టణాల్లో ఇంటింటికీ తిరుగుతూ పాలు సరఫరా చేస్తున్నారు. ఉదయం పూట పనులు చూసే పారిశుధ్య కార్మికులు చలితో ఇబ్బంది పడుతూ గ్రామాలను శుభ్రం చేస్తున్నారు. చలి ఉన్నా తమ పనులు చేసుకోవాలి కందేనని వారు పేర్కొంటున్నారు. చలి కారణంతో దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారు ఇబ్బంది పడుతూ ఆసుపత్రులకు వెళ్తున్నారు. పట్టణంలో తెల్లవారుజామున వాహనాలు లైట్లు వేసుకొని వస్తున్నా రోడ్డు కనిపించనంత దట్టంగా మంచు కమ్ముకోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలో ఉదయం కొందరు చలిలోనే వాకింగ్, రన్నింగ్ చేయడం కనిపించింది. కూలీలు చలిమంట కాగుతూ కనిపించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉదయం 6:30 గంటల సమయంలో దట్టమైన పొగ మంచు కమ్మేసింది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### విద్యార్థులు, ఉద్యోగుల అవస్థలు..

చలి ఉన్నా.. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, ఉద్యోగులు విధులకు హాజరు కావాల్సిందే. ప్రస్తుతం జిల్లాపై చలిపులి పంజా విసురుతుండడంతో ఉదయాన్నే పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, విధులకు వెళ్తున్న ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు కూడా చలికి వణుకుతూనే కూలి పనులకు వెళ్తున్నారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

అలర్జీ, ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బీపీ, గుండె సంబంధిత రోగులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి. చిన్నారులకు చలిగాలి తగలకుండా చర్యలు తీసుకోవాలి. ఎండ వచ్చిన తర్వాతే బయటకు రావాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే చలిగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 8 గం టలకు ముందు, సాయంత్రం 6 గంటల తర్వాత దూర ప్రయాణాలను రద్దు చేసుకుంటేనే మేలు

## సమగ్ర సేంద్రియ సాగు క్షేత్రాన్ని సందర్శించిన రైతుల బృందం




**హుజూర్ నగర్ మహా** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ రాజేంద్రనగర్ వారి ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు ఐదు రోజుల సేంద్రియ వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజున రైతుల బృందం సిరిపురం గ్రామం, నడిగూడెం మండలంలో సమీకృత సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై క్షేత్ర సందర్శన చేసినట్లు కే.వి.కే గడ్డిపల్లి శాస్త్రవేత్త ఎ.కిరణ్ తెలిపారు.సిరిపురం గ్రామ రైతు వశీకర్ల శేషు కుమార్ స 1.5 ఎకరం లో సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయ, ఉద్యాన పంటలు, గొర్రెలు,నాటు కోళ్ల పెంపకం, గడ్డిజాతి పంటలు పండ్ల తోటలలో సమగ్ర సేంద్రీయ వ్యవసాయ విధానాలను పాటించి రైతులకు ఆదాయాన్ని పెంచే విధానాన్ని రైతులకు వివరించడం జరిగింది. కే.వి.కే మృత్తిక శాస్త్రవేత్త ఏ.కిరణ్ పాల్గొని, జీవామృతం, ఘన జీవామృతం, వేస్ట్ డీకంపోజర్ మరియు వర్మి కంపోస్ట్, తయారు చేసుకొని వాడటం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోని భూసార పెంచుకోవచ్చని ప్రాక్టికల్ గా తయారు చేసి తెలియజేశారు అనంతరం సేంద్రీయ పద్ధతిలో వివిధ రకాల కషాయలు అగ్నిస్త్రం, దశపర్ణి కషాయలు, నీమాస్త్రం తయారీ చేసి వాటి ఎలా చీడపిడలని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే.వి.కే శాస్త్రవేత్తలు ఎ.కిరణ్ అండ్ పి.అక్షిత్ సాయి, అభ్యుదయ సేంద్రియ రైతు వి. శేషు కుమార్ గారు, సిరి ఫౌండేషన్ చైర్మన్ ఎం.గోపయ్య 45 మంది రైతులు పాల్గొన్నారు.

## భవిత దివ్యాంగుల కేంద్రంలో చిన్నారుల ఫోటోలతో క్యాలెండర్ విడుదల




**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ భవిత దివ్యాంగుల కేంద్రము నందు గురువారం ఆరోగ్యమే మహాభాగ్యం ట్రస్ట్ చైర్మన్ శీలం వెంకీ చేయించినటువంటి చిన్నారులతో కూడిన క్యాలెండర్ లను మండల విద్యాధికారి సైదానాయక్ చేతుల మీదుగా చిన్నారులకు ఇప్పించడం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేయడం ఎంతో అదృష్టదాయకమని వారిని కొనియాడారు మరియు భవితా కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు కావలసిన తర్ఫీదులు ఇవ్వడానికి నిష్ణాతులైన ఐఈఆర్పి మరియు శారీరక,సెరిబ్రల్ పాలసీ గల చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు అందించబడతాయని వీటిని దివ్యంగ చిన్నారులు తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరడం జరిగింది తదనంతరం ట్రస్ట్ వారు చిన్నారులతో నూతన సంవత్సర కేకు కట్ చేయించడం జరిగినది ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ (బాయ్స్) ప్రధానోపాధ్యాయులు బీరెల్లి శ్రీనివాస్ రెడ్డి గారు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని ,ఫిజియోథెరపిస్ట్ మీరా, భవిత కేంద్రం నిర్వాహకులు శ్రీనివాస్, సి ఆర్ పి సైదులు,ట్రస్ట్ సభ్యులు అల్వాల ఉపేందర్ ఇంకా భవిత కేంద్రం నందలి చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

## పని ప్రదేశాలలో మహిళలకు స్వేచ్ఛ వాతావరణం కల్పించాలి

**జిల్లా కో ఆర్డినేటర్ చైతన్య**




**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా కేంద్రం లోని మమతా హోటల్ నందు మహిళా శిశు సంక్షేమ శాఖ లోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం (డి హెచ్ ఈ డబ్ల్యూ) ఆధ్వర్యంలో పని ప్రదేశాలలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నిరోధక చట్టం(పోష్) యాక్ట్2013 పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న తరుణంలో, వారు పని చేసే చోట ఎదురయ్యే వేధింపులను అరికట్టడానికి ఈ చట్టం ఎంతో కీలకమన్నారు. ఐసీసీ కమిటీ ప్రాముఖ్యత 10 మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థలో తప్పనిసరిగా 'ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ' (ఐసీసీ) ఉండాలని కోఆర్డినేటర్ చైతన్య స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల నిర్వచనం, ఫిర్యాదు చేసే విధానం మరియు బాధితులకు చట్టం కల్పించే రక్షణల గురించి వివరించారు. పని ప్రదేశంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు మహిళలు మౌనంగా ఉండకుండా,ధైర్యంగా ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వినోద్, భవ్య, హోటల్ యాజమాన్యం, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో సరిపోను యూరియా నిల్వలు ఉన్నాయని రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదు

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట మండలం పిల్లలమర్రి పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదామును సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్, ఈ పాస్ మిషన్ లను పరిశీలించారు. ఇప్పటివరకు పిల్లలమర్రి పిఎసిఎస్ ద్వారా 290.43 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకి పంపిణి చేశామని ప్రస్తుతం 11.90 మెట్రిక్ టన్నుల (266 బస్తాలు )యూరియా నిల్వలు ఉన్నాయని ఇంకో 100 మెట్రిక్ టన్నుల యూరియా అయితే ఈ యాసంగి సీజన్ కు సరిపోతుందని శుక్రవారం సాయంత్రం నాటికి మరో రెండు లారీల యూరియా లోడ్లు వస్తుందని ఏ డి ఏ కలెక్టర్ కు వివరించగా ఎంత యూరియా అవసరం ఉంటే అంత సరఫరా చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ అక్కడే ఉన్న రైతులతో మాట్లాడుతూ ఎరువులు మంచిగా సరఫరా చేస్తున్నారా? ఒక ఎకరం వరి పంట ద్వారా ఎంత ఖర్చవుతుంది, ఎంత దిగుబడి వస్తుందని అడగగా 25 వేల వరకు ఖర్చు అవుతుందని, 33 వేలు మిగులుతాయని తెలిపారు. సాంప్రదాయ పంటలైన వరి నుండి అధిక లాభాలు వచ్చే పామాయిల్, కూరగాయల సాగు వైపు రైతులు దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సూచించారు. కలెక్టర్ వెంట డిసిఓ ప్రవీణ్ కుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, ఏ డి ఏ జ్ఞానేశ్వరి దేవి, ఏ ఏవో కృష్ణ సందీప్,ఏ ఈ ఓ స్వాతి, పి ఏ సి ఎస్ కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

# డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్ గా మారాలి

- డ్రగ్స్ ఉపయోగించి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- డ్రగ్ ఫ్రీ సూర్యాపేటకొరకు కృషి చేయాలి
- డ్రగ్స్ కి వ్యతిరేకంగా కదం తొక్కిన యువత డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో మారుమోగిన సూర్యాపేట పట్టణ వీధులు
- జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి లక్ష్మి శారద, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పి కే నరసింహ






**సూర్యాపేట జిల్లా మహా:** విద్యార్థులు బంగారు భవిష్యత్ నిర్మించుకునేందుకు కలలను కని వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని సూర్యాపేట జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి,జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మి శారద అన్నారు. జాతీయ యువజన దినోత్సవం లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట పట్టణంలో ని కోర్ట్ భవనం నుండి సంతోష్ బాబు చౌరస్తా మీదుగా పి ఎస్ ఆర్ సెంటర్ నుండి పోస్ట్ ఆఫీస్ మీదుగా జూనియర్ కళాశాల వరకు డ్రగ్ ఫ్రీ ఇండియా అవగాహనా ర్యాలీలో జిల్లా ఎస్పి కే నరసింహ, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ లతో కలిసి జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మి శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో జిల్లా జడ్జి మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి చాప కింద నీరులా వ్యాపించి యువత జీవితాలను నిర్వీర్యం చేస్తుందని వాటిని సమాజం నుండి నిర్మూలించేందుకు జిల్లాలోని పరిపాలన, పోలీస్, న్యాయ శాఖలు కృషి చేస్తున్నాయని అన్నారు.డ్రగ్స్ ఉపయోగించడం వల్ల మనసు,శరీరం, వ్యక్తిత్వం నిర్వీర్యం చెంది తప్పుడు పనులు చేసేలా ప్రేరేపిస్తాయని వాటి వల్ల మనకి ఎలాంటి ఉపయోగం లేదని ఆరోగ్యానికి హానికరం అని మాదకద్రవ్యాలు గంజాయి లాంటి వాటిని తయారు చేసిన, రవాణా చేసిన, సేవించిన,అమ్మినా, కొనుగోలు చేసిన, తెలియక చేసిన నేరమవుతుందని ఎన్ డి ఎస్ ఏ యాక్ట్ ప్రకారం నేరమవుతుందని బయటికి రావడానికి కూడా బెయిల్ కూడా ఇవ్వకుండా శిక్షలు విధించడం జరుగుతుందని, 20 సంవత్సరాల నుంచి యావజీవ శిక్ష పడేలా కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. మాదకద్రవ్యాలు తెలియక చేదించిన,బానిసైన వారి కొరకు రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి డాక్టర్ల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించి వారిని మాదకద్రవ్యాల నుండి బయట పడేసి యధావిధిగా జీవితం కొనసాగించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ న్యాయ సహాయం చేస్తుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.జీవితంలో స్నేహితుల పాత్ర చాలా గొప్పదని జయాల్లో,అపజయాల్లో నేనున్నానంటూ వెన్ను తట్టే మంచి స్నేహితులు ఉంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు అని, అదే తప్పుడు స్నేహం అలవాటు అయితే చెడు మార్గాలలో వెళ్లి జీవితాలను నాశనం అవుతాయని తెలిపారు. మాదకద్రవ్యాలు పాఠశాలలో, కళాశాలలో చాక్లెట్స్ రూపంలో తయారుచేసి డ్రగ్స్ కు యువత ఎడిక్ట్ అయ్యేలా చేసి డ్రగ్స్ కు అలవాటు పడి తప్పుడు మార్గాలలో నేరాలు చేసేలా ప్రేరేపిస్తున్నారని వాటి నుంచి మనం ముందుగానే మేల్కొని చుట్టుపక్కల ఎక్కడైనా మాదకద్రవ్యాలు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని డ్రగ్ ఫ్రీ సూర్యాపేట నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.. డ్రగ్స్ ఉపయోగించడం వల్ల జీవితాలు కుటుంబాలు ఆగమయవుతున్నాయి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా భారతదేశంలో డ్రగ్స్ ను దూరం చేయుటకు డ్రగ్ ఫ్రీ ఇండియా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని డ్రగ్స్ ఉపయోగించడం వల్ల జీవితాలు,కుటుంబాలు ఆగమయవుతున్నాయని డ్రగ్స్ అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులు సమాజంలో కలహాలు సృష్టించి అభివృద్ధి చెందకుండా చేసేందుకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. పాఠశాలలో, కళాశాలలోని టీచర్స్ లెక్చరర్స్ విద్యార్థుల యొక్క ప్రవర్తన, అలవాట్ల పై నిఘా పెట్టాలని,మంచి ఆలోచనలు ఆచరణలోకి తీసుకొచ్చి కార్యాచరణగా అయి మంచి అలవాట్లుగా మారి మంచి క్యారెక్టర్ నిర్మించి మన గమ్యాన్ని చేర్చుతాయని తెలిపారు. విద్యార్థులకు కథ రూపంలో చెడు స్నేహం చేయటం ద్వారా డ్రగ్స్ ఉపయోగించటం వల్ల కలిగే నష్టాలను, మంచిగా చదవటం వల్ల కలిగే లాభాలను ఆసక్తి కలిగించేలా చెప్పారు.గ్రామీణ ప్రాంతాలలో నేడు డ్రగ్స్, గంజాయి ఉపయోగిస్తున్నారని వాటిని సమాజం నుండి తొలగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీయనుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. భావి భారత సమాజం నుండి గంజాయి, డ్రగ్స్ తొలగించేందుకు కృషి చేయాలి ఎస్ పి కే నరసింహ మాట్లాడుతూ యువత భారతదేశ గొప్ప వనరులని, బావి భారత పౌరులని సమాజం నుండి గంజాయి, డ్రగ్స్ తొలగించేందుకు విద్యార్థులే ప్రచారకర్తలుగా అంబాసిడర్ గా మారాలని కోరారు. డ్రగ్స్, గంజాయి అమ్మిన, కొనుగోలు చేసిన చట్టరిత్యా నేరమని కఠినమైన శిక్షలు పడతాయని, వాటిని సేదించటం వల్ల ఆరోగ్యం నాశనం అవుతుందని ఇలా చాలామంది మధ్యలోనే జీవితాలు కోల్పోతున్నారని అన్నారు. డ్రగ్స్, గంజాయి మహమ్మారి ని సమాజం నుండి కుక్కటివేళ్ళతో తీసివేయాలని సూచించారు.డ్రగ్స్ రహిత సమాజం కోసం జిల్లా ఎస్పి అందరిచే ప్రతిజ్ఞ చేపించారు. అనంతరం ప్లెక్సీ పై సంతకాలు చేశారు. డ్రగ్స్ ఫ్రీ ఇండియా ర్యాలీకి విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సూర్యాపేట పట్టణ వీధులు మారుమోగాయి.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఫర్వీన్ కౌసర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు, ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ జడ్జి అపూర్వ రవళి, సెకండ్ ఎడిషనల్ జూనియర్ జడ్జి మంచాల మమత,బార్ అసోసియేషన్ చైర్మన్ లింగయ్య, సెక్రటరీ రాజు,ఆర్ డి ఓ వేణుమాధవ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా అధికారులు, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు హాజరైనారు.

## సమాజానికి దిశానిర్దేశకులు మంచి సమాజ నిర్మాతలు విద్యార్థిని, విద్యార్థులు

- మత్తు వ్యసనానికి దూరంగా ఉండాలి
- హుజూర్ నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన్




**హుజూర్ నగర్ మహా** యువత ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులు గంజాయి,క్రొకైన్, ధూమపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హుజూర్ నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన్ విద్యార్థులను కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సమాజానికి దిశా నిర్దేశకులు, మంచి సమాజ నిర్మాతలు విద్యార్థినీ విద్యార్థులు, యువకులేనని అటువంటివారు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆమె కోరారు. మాదక ద్రవ్యాలను కలిగి ఉన్నా, అమ్మినా, కొనుగోలు చేసినా, సేవించినా, చట్టంలో తీవ్రమైన నేరంగా నిర్దేశించబడినదనీ అటువంటి నేరానికి పాల్పడిన వారికి 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నదని, అందువల్ల మాదక ద్రవ్యాలను వినియోగించి విద్యార్థులు తమ బంగారు, ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆమె విద్యార్థులకు హితవు చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక స్థితి తీవ్రంగా దెబ్బతిని అనారోగ్యం పాలై అత్యంత చిన్న వయసులోనే మరణించవలసి వస్తుందని అందువల్ల యువత మాదక ద్రవ్యాల కు దూరంగా ఉండాలని కోరారు. మీకు సమీపంలో ఎక్కడైనా మాదక ద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లుగా మీకు తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు ఆ సమాచారాన్ని అందించి మాదక ద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులు నడుం బిగించాలని ఆమె విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష



**కరీంనగర్ మహా :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో గల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆలయ చైర్మన్లు, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులతో సమీక్షించారు. వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, షామియానాకు, క్యూ లైన్లు, బారికేడ్లు తదితర అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని, ఆహార వ్యర్థాలు రోడ్లపై పడేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీ దృష్యా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ట్రాఫిక్, పోలీస్, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ తదితర విభాగాలు సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు త్వరిత గతిన పూర్తి చేయాలని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని పేర్కొన్నారు. క్యూ లైన్లు ఏర్పాటు చేసి బారికేడ్లతో బందోబస్తు నిర్వహించాలన్నారు. స్టేజి, లైటింగ్, సౌండ్, డెకరేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, షార్ట్ సర్క్యూట్ జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆలయ చైర్మన్లు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో సుధాకర్ ఆలయ అర్చకులు నాగరాజు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్ నాశనం అవుతుంది

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్విన్ కౌసర్**



**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట పట్టణ కేంద్రలోని ఆర్ టి సి బస్టాండ్ ప్రాంగణంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ్ ముక్త్ అభియాన్ కార్యక్రమం కు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్విన్ కౌసర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని బాలికలు, 21 సంవత్సరాలు నిండని బాలుర వివాహాలు చట్టవిరుద్ధమని, అటువంటి వివాహాలు నిర్వహించిన వారిపై బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బాల్య వివాహాల వల్ల బాలికల విద్యకు ఆటంకం కలుగుతుందని, ఆరోగ్య సమస్యలు, మాతృ మరణాలు, శిశు మరణాలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలను నివారించాలి ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి రజిత గోపు మాట్లాడుతూ బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్లైన్ 1098, పోలీస్ స్టేషన్ 100, లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, గ్రామాలలో బాల్య వివాహాలను అరికట్టెందుకు గ్రామ సర్పంచులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలను నివారించాలని తెలిపారు.ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ జడ్జి అపూర్వ రవళి మాట్లాడుతూ బాలికలను చదివించి ఉన్నత స్థానాలకు చేరేంత వరకు వివాహం చేయకూడదని సూచించారు సెకండ్ ఎడిషనల్ జూనియర్ జడ్జి మంచాల మమతా మాట్లాడుతూ 18 సం ల లోపు ఆడపిల్లలకు వివాహం చేస్తే 2 సం ల శిక్ష, 1 లక్ష రూపాయలు జరిమానా విధించటం జరుగుతుందని ప్రతి ఒక్కరు చట్టాలను గౌరవించాలని కోరారు.ఆర్టీసీ డి ఎం సునీత బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. అంతకుముందు బాలసదన్ విద్యార్థి నిలచే ఆర్థిక స్తోమత లేక ముగ్గురు ఆడపిల్లల తల్లి పెద్ద అమ్మాయి కి బాల్య వివాహం చేయటం ఆ వివాహాన్ని అధికారులు అడ్డుకోని ఆమెను బాల సదన్ లో చేర్పించి జాబ్ వచ్చేంత వరకు ప్రభుత్వమే చదివిస్తుందని ప్రదర్శించిన నాటకం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లోడి. ఎల్. ఎస్. ఎ నామినేటెడ్ మెంబర్స్ గుంటూరు మధు గారు, నల్లపాటి మమత ,డిప్యూ టీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బట్టిపల్లి ప్రవీణ్ కుమా తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై సిబ్బంది రోడ్లమీద ఎలాంటి ఆటంకాలు, ప్యాచ్ వర్క్ లు లేకుండా ఏర్పాట్లు చేయాలి

**జాతీయ రహదారిపై భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఎస్పీ నరసింహ**

**సూర్యపేట జిల్లా మహా:** వాహనాల రద్దీ దృష్ట్యా ప్రయాణాలు సాఫీగా సాగేందుకు జాతీయ రహదారి సిబ్బంది రోడ్లమీద ఎలాంటి ఆటంకాలు, ప్యాచ్ వర్క్ లు లేకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్సంక్రాంతి పండుగసందర్భంగా వాహనాల రద్దీ దృష్ట్యా ప్రయాణాలు సాఫీగా సాగేందుకు జాతీయ రహదారి సిబ్బంది రోడ్లమీద ఎలాంటి ఆటంకాలు, ప్యాచ్ వర్క్ లు లేకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ నుండి సంక్రాంతి పండగ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, ప్రయాణాలు సాఫీగా సాగేందుకు ముందస్తు ఏర్పాట్లపై పోలీస్, ఆర్డీవో, జాతీయ రహదారి అధికారులతో ఆయన వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు హైదరాబాదు నుండి స్వగృహాలకు వెళ్లేందుకు అధిక మొత్తం లో వాహనాలనుఉపయోగిస్తారు కాబట్టి జాతీయ రహదారి 65 పై ఎలాంటి ఆటంకాలు, గుంటలు ప్యాచ్ వర్క్ లు లేకుండా జాతీయ రహదారి వెంట రాత్రిపూట లైట్లు వెలిగే విధంగా చూడాలని జాతీయ రహదారి సిబ్బందిని ఆదేశించారు.టేకుమట్ల, గుంపుల,తిరుమలగిరి,మునగాల, ఆకుపాముల,కోమరబండ క్రాస్ రోడ్, రామాపురం క్రాస్ రోడ్ యూ టర్న్ లలో ఎలాంటి సంఘటనలు జరగకుండా వెంటనే అన్ని రకాల రోడ్డు రిపేర్లు చేయించాలని జాతీయ రహదారిపై సంక్రాంతి పండుగ సమయంలో రోడ్డు లోపాలకు సంబంధించి ఏమైనా అనుకోని రోడ్డు ప్రమాదాలు జరిగితే జాతీయ రహదారి సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఎస్పీ కే నరసింహ,ఆర్ అండ్ బి ఈ ఈ సీతారామయ్య, డి ఇ పద్మావతి, రెవిన్యూ అధికారులు సిబ్బంది తదితరులు హాజరైనారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా జాతీయ రహదారి 65 పై ప్రమాదాలు సంబవించ కుండా భద్రత చర్యలు తీసుకోవాలి. సంక్రాంతి పండుగకు వెళ్లే ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా భద్రత చర్యలను జిల్లా ఎస్పి కే నరసింహ తో కలిసి,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. రాయినిగూడెం యూ టర్న్, 7స్టార్ హోటల్, పిల్లలమర్రి యూ టర్న్, జనగాం ఎక్స్ రోడ్డు, అంజనాపూరి జంక్షన్, కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు చౌరస్తా, ఈనాడు ఆఫీస్ జంక్షన్, ఎఫ్సిఐ గోదాం జంక్షన్ లు వద్ద జరుగుతున్నా ఏర్పాట్లను క్షేత్ర స్థాయి లో పరిశీలించారు.ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరగకుండా పనిచేయాలని, సంక్రాంతి పండుగ దృష్ట్యా జాతీయ రహదారి 65 పై వాహనాల రద్దీ అధికంగా ఉంటుందని హైద్రాబాద్ నుండి సూర్యాపేట జిల్లా మీదుగా ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలకు వాహనాలు అధికంగా వెళ్తూ ఉంటాయి కావున ఈ క్రమంలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా జిల్లా పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం పటిష్టమైన భద్రత తీసుకోవడం జరిగిందని తెలిపినారు. టేకుమట్ల వద్ద రోడ్డు మరమత్తు చేయించడం జరిగిందని,జిల్లా పరిధిలో రోడ్డు వెడల్పు చేయడం, బ్రిడ్జి ల నిర్మాణం పనులు జరుగుతున్నందున వాహనదారులు గమనించి నిదానంగా వెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ ఆర్డీవో వేణు మాధవ్,డిఎస్పీ ప్రసన్నకుమార్, జాతీయ రహదారి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎక్సిక్యూటిక్ ఇంజనీరు సీతారాములు, ఇన్స్పెక్టర్ లు రాజశేఖర్, వెంకటయ్య,రామారావు, ఎస్సైలు సాయిరాం, బాలు నాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు





# కాశీలో రుద్ర తాండవం

'వారణాసి'లో ప్రత్యర్థుల బెండు తీస్తున్నారట రుద్ర. ఈ రుద్ర తాండవం ఎలా ఉంటుందో సిల్వర్ స్క్రీన్‌పై ఆడియన్స్ చూసేందుకు కొంత సమయం ఉంది. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఫారెస్ట్ అడ్వెంచరస్ అండ్ మైథాలజీ సినిమా 'వారణాసి'. ఈ చిత్రంలో రుద్రపాత్రలో మహేశ్‌బాబు, మందాకినిగా ప్రియాంకా చోప్రా, కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. ఓ కీలకపాత్రలో ప్రకాశ్‌రాజ్ నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఇటీవల హైదరాబాద్‌లో మొదలైంది. ముందు మహేశ్‌బాబు, ప్రకాశ్‌రాజ్ కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరించారట. ప్రస్తుతం మహేశ్‌బాబు పాల్గొనగా ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నారని సమాచారం. ఈ సినిమా చిత్రీకరణ కోసం కాశీ నగరాన్ని తలపించేలా ఓ భారీ సెట్ వేశారు మేకర్స్. ఈ సెట్‌లోనే ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారని సమాచారం. కేఎల్. నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 వేసవిలో విడుదల కానుంది.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com